ప్రతి అక్షరం - ప్రజల కోసం

# రోమింగ్ న్యూస్

తెలుగు దినపత్రిక

యాదాద్రి భువనగిరి

పేజీలు : 8
సంపుటి : 3
సంచిక : 139

మంగళవారం 19 నవంబర్ 2024 / చీఫ్ ఎడిటర్ : గొట్టిపర్తి భాస్కర్ / HYDERABAD, KARIMNAGAR, KHAMMAM, NALGONDA, NIZAMABAD, WARANGAL, MAHABUBNAGAR.RANGAREDDY, MEDAK, ADILABAD

## తొలి టెస్టే కీలకం



.. వివరాలు 7లో



## దళిత రైతుల ఇళ్లపై దౌర్జన్యకాండ

- సీఎం బ్రదర్ గిరిజన రైతులపై దాడి చేసినా కేసులుండవా?
- లగచర్లలో అర్ధరాత్రి మహిళలపై పోలీసుల దాడి చేశారు
- గిరిజన రైతులను అరెస్టు చేసి చిత్రహింసలు పెట్టారు
- తెలంగాణలో ఏం జరుగుతుందో దేశానికి తెలియాలి
- భూములను ప్రభుత్వం బలవంతంగా గుంజుకుంటోంది
- లగచర్ల ఘటన చిన్నదేమీ కాదు..
- ఈ ఘటనపై ప్రధాని, రాహుల్ గాంధీ స్పందించాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్

04

# గల్ఫ్‌బాధిత కుటుంబాలకు సర్కారు భరోసా

- ఏ కారణంతో మరణించినా రూ.5 లక్షలు వర్తింపు
- రేపు వేములవాడలో ఎక్స్ గ్రేషియా అందించనున్న సీఎం
- మేనిఫెస్టో హామీ మేరకు ఇప్పటికే జీవో నం.205 జారీ



**జగిత్యాల రోమింగ్ న్యూస్:** అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కొక్కటిగా అమలు చేస్తోంది. మేనిఫె స్టోలో 'గల్ఫ్ కార్మికుల సంక్షేమం, ఎన్నారైల సంక్షేమం' కోసం ఇచ్చిన హామీ మేరకు గల్ఫ్ లో మరణించిన వారి కుటుంబాలకు రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందించబోతున్నది. ఏ కారణంతో మరణించినా వర్తింపజేయనుంది. ఈ మేరకు గత సెప్టెంబర్ లో జీవో నంబర్ 205 ఇచ్చిన ప్రభుత్వం, రేపు (బుధవారం) ఎక్స్ గ్రేషియా అందించనున్నది. ఈ నెల 20.న సీఎం రేవంత్ రెడ్డి వేములవాడ పర్యటనలో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన 17 మంది బాధిత కుటుంబాలకు ఎక్స్ గ్రేషియా అందించనున్నారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.85 లక్షలను కేటాయించింది. గల్ఫ్ కార్మి కులను ఆదుకోవాలన్న నిర్ణయంపై టీపీసీసీ

మిగతా 2 లో



## అంబులెన్స్‌కు దారినివ్వని వ్యక్తి 2.5 లక్షల జరిమానా



02

## 2025-26 నాటికి వందే భారత్ స్లీపర్ రైళ్లు

## కేసీఆర్ బాటలోనే రేవంత్

అవును.. నేను గులామ్‌నే..

సీఎం రేవంత్‌కు కిషన్‌రెడ్డి కౌంటర్




.. వివరాలు 4లో

## రుణమాఫీ చేశాం

- దమ్ముంటే కేంద్రం తరపున కమిటీని పంపండి
- వచ్చేందుకు డబ్బులు లేకపోతే నాకు చెప్పండి
- నేనే ప్రత్యేక విమానాన్ని సిద్ధం చేసి పంపిస్తా..
- ప్రధాని, బీజేపీకి సీఎం రేవంత్‌రెడ్డి సవాల్

02

## వేములవాడ అభివృద్ధికి రూ.127.65 కోట్లు



రేపు పనులు ప్రారంభించనున్న సీఎం రేవంత్‌రెడ్డి

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

02



02

## ఆక్రమణలను కూల్చిన హైడ్రా



## భూములు పోయాక మేం ఎలా బ్రతకాలి?

### మా భూములను వదిలేయాలి.. మా భూములు ఇచ్చేది లేదు

ఉన్న భూమి మొత్తం తీసుకుంటానంటే ఎలా?

మా ఇంట్లోనే భయపడుతూ బతుకుతున్నాం

జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు లగచర్ల బాధితుల ఫిర్యాదు

తమ భూములను వదిలేయాలని సీఎం రేవంత్ రెడ్డిని లగచర్ల ఫార్మా కంపెనీ బాధితులు విజ్ఞప్తి చేశారు. ఉన్న భూమి మొత్తం తీసుకుంటా అంటే ఎలా బతకాలని ప్రశ్నించారు.ఇంట్లో ఉండాలంటేనే భయం వేస్తోందని.. పోలీసులు ఎప్పుడు వచ్చి ఏం చేస్తారోనని బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

**న్యూఢిల్లీ రోమింగ్ న్యూస్: :** లగచర్లలో అర్ధరాత్రి సమయంలో పోలీసులు సృష్టించిన అరాచకంపై బాధితులు ఢిల్లీలోని జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. మా భూములు ఇచ్చేది లేదంటూ గత 9 నెలలుగా చాలా ధర్నాలు చేస్తున్నామి లగచర్ల బాధితులు

మిగతా 2 లో

## ఫార్మాపై సీఎంకు ఎందుకంత ప్రేమ

- ఫార్మా కంపెనీలే ముఖ్యమా?
- పోలీసుల వైఫల్యంతో లగచర్ల ఘటన
- బాధితులతో బీజేపీ నాయకులు డీకే అరుణ, ఈటల రాజేందర్ ములాఖత్



**హైదరాబాద్, రోమింగ్ న్యూస్:** ఫార్మా కంపెనీలపై ముఖ్యమంత్రికి ఎందుకంత ప్రేమ అని బీజేపీ ఎంపీ డీకే అరుణ ప్రశ్నించారు. సంగారెడ్డి సెంట్రల్ జైలులో రిమాండ్‌లో ఉన్న 16 మంది లగచర్ల బాధితులతో బీజేపీ ఎంపీలు డీకే అరుణ, ఈటల రాజేందర్ ములాఖత్ అయ్యారు. అనంతరం డీకే అరుణ మాట్లాడుతూ.. ఓటేసి గెలిపించిన జనాల కంటే మీకు ఫార్మా కంపెనీ ముఖ్యమా అని నిలదీశారు. లగచర్ల గ్రామంలో ఫార్మా కంపెనీకి భూములు ఇవ్వబోమని రైతులు 8 నెలలుగా ఆందోళన చేస్తున్నారని

మిగతా 2 లో

## మూసీ పునరుజ్జీవం వద్దని కేసీఆర్ చెప్పగలరా



- అలా చెబితే.. పనులు ఆపేస్తాం
- లగచర్ల ఘటనలో అధికారులపై దాడి దారుణకాండ
- కేటీఆర్ అనుచరుల పక్కా ప్లాన్
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

.. వివరాలు 2లో

## కాంగ్రెస్‌లో అంతర్గత స్వేచ్ఛ ఎక్కువే

- జనవరిలో పదవుల పందేరం
- స్థానిక ఎన్నికల్లో సత్తాచాటాలి
- కార్యకర్తలకు పిసిసి చీఫ్ మహేశ్ సూచన



.. వివరాలు 4లో

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
మంగళవారం
19 నవంబర్
2024





# అంబులెన్స్‌కు దారినివ్వని వ్యక్తి
# 2.5 లక్షల జరిమానా



**న్యూఢిల్లీ, నవంబర్ 18 :** రోడ్డుపై సైరన్ మోగిస్తూ అంబులెన్స్ వెళ్తుందంటే ఎవరో ప్రాణాపాయ స్థితిలో ఉన్నారని అర్థం. అందుకే అంబులెన్స్ సౌండ్ వినిపించగానే ఎంతటివారైనా సరే వెంటనే తమ వాహనాలను సైడ్‌కు తీసుకుంటారు. సినీ సెలబ్రిటీలైనా, రాజకీయ నేతలైనా.. చివరికి ప్రధాని, రాష్ట్రపతి అయినా సరే అంబులెన్స్ వెళ్లేందుకు దారి ఇస్తారు. అయితే, కొందరు ఆకతాయిలు ఇవేవీ పట్టించుకోరు. అంబులెన్స్‌కు దారి ఇవ్వకపోగా.. అడ్డుగా వెళ్తుంటారు. తాజాగా ఓ వ్యక్తి అంబులెన్స్‌కు దారి ఇవ్వకుండా నిర్లక్ష్యంగా కారు నడిపినందుకు పోలీసులు షాక్ ఇచ్చారు. కారు నడిపిన వ్యక్తి డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేయడమే కాకుండా.. భారీ జరిమానా కూడా విధించారు. ఈ ఘటన కేరళలో నవంబర్ 7న చోటు చేసుకోగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఓ వ్యక్తిని చలకుడిలోని పొన్నాని నుంచి త్రిస్సూర్ మెడికల్ కాలేజీకి అంబులెన్స్‌లో తీసుకెళ్తున్నారు. రోడ్డుపై అంబులెన్స్ వెళ్తుంటే అన్ని వాహనాలూ సైడ్‌కు వెళ్లాయి. అయితే, ఓ కారు మాత్రం అంబులెన్స్ ఎంతగా హారన్ కొడుతున్నా, కుయ్ కుయ్ అంటూ సౌండ్ చేస్తున్నా అవేవీ పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించాడు. దాదాపు రెండు కిలోమీటర్ల వరకూ అంబులెన్స్ ఆ కారు వెనకాలే వెళ్లాల్సి వచ్చింది. ఇందుకు సంబంధించిన వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ వీడియో కేరళ పోలీసుల దృష్టికి వెళ్లడంతో వారు చర్యలకు ఉపక్రమించారు. వీడియో ఆధారంగా ఆ కారు ఎవరిదో గుర్తించారు. నేరుగా ఆ వ్యక్తి ఇంటికి వెళ్లి.. అంబులెన్స్‌కు దారి ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. దీంతో అతడు పొంతనలేని సమాధానాలు ఇవ్వడంతో పోలీసులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అంబులెన్స్‌కు దారి ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన సదరు వ్యక్తికి షాక్ ఇచ్చారు. దాదాపు రూ.2.5 లక్షల భారీ జరిమానా విధించారు. అంతేకాదు అతడి లైసెన్స్ కూడా రద్దు చేశారు.

# తెలంగాణలో రుణమాఫీ చేసి చూపించాం



హైదరాబాద్, నవంబర్ 18: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వంపై బీజేపీ చేస్తున్న విమర్శలకు సీఎం రేవంత్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. రాష్ట్రంలో రైతు రుణమాఫీపై దమ్ముంటే కేంద్ర ప్రభుత్వం తరపున ఓ కమిటీ వేసి తెలంగాణకు పంపించాలని ప్రధాని నరేంద్ర మోదీ, బీజేపీ పెద్దలకు సవాల్ విసిరారు. రాష్ట్రానికి వచ్చేందుకు కేంద్రం వద్ద దగ్గర డబ్బులు లేకపోతే చెప్పాలన్నారు. తానే నేనే ప్రత్యేక విమానం ఏర్పాటు చేస్తానని చాలెంజ్ చేశారు. మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో ఉన్న సీఎం రేవంత్.. సోమవారం పుణేలో మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో మేం రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి చేసి చూపించామన్నారు. 25 రోజుల్లో రూ.18 వేల కోట్లతో 23 లక్షల మంది రైతులకు రుణవిముక్తి కల్పించామన్నారు. కేంద్ర కమిటీ రాష్ట్రానికి వస్తే దీనికి సంబంధించి పూర్తి వివరాలు ఇస్తామన్నారు. రాహుల్ గాంధీ, ఖర్గే నేతృత్వంలో రైతులకు ఇచ్చిన అతి పెద్ద గ్యారెంటీ రుణమాఫీని అమలు చేశా మన్నారు. బీజేపీ ప్రభుత్వం రైతులు, పేదలు, నిరుద్యోగుల కోసం ఏమి చేయలేదని, ఇన్ని వైఫల్యాలు వారి వైపు ఉన్నప్పటికీ ప్రధాని మోదీ మా గ్యారెంటీల గురించి మాట్లాడుతున్నారని విమర్శించారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు, మహిళలకు ఫ్రీ బస్సు ప్రయాణం కల్పిస్తున్నామన్నారు. సన్న రకం వరిపై ఎంఎస్పీ మీద రూ.500 బోనసు రైతులకు ఇస్తున్నామన్నారు.

## మోదీకి సక్సెస్‌స్టోరీ ఉందా?

కాంగ్రెస్ గ్యారెంటీ అంటే భారతీయ ఝూటా పార్టీ గ్యారెంటీ, మోడీ గ్యారెంటీ కాదని సీఎం రేవంత్ విమర్శించారు. రాజకీయాల్లో నష్టం వచ్చినా ఇ విమర్శించ వేసే ప్రసక్తే లేదని, ఆరు నూరైనా హామీలన్నీ అమలు చేసి తీరుతామన్నారు. ప్రధాని మోడీకి ఈ 11 ఏండ్లలో ఎలాంటి సక్సెస్ స్టోరీ లేదని, మహారాష్ట్రలో కోవర్ట్ ఆపరేషన్ పాలిటిక్స్ నడిపారని ధ్వజమెత్తారు. మహారాష్ట్ర సీఎం ఏక్నాథ్ షిండే, అజిత్ పవార్, అశోక్ చౌహాన్ వారి పార్టీలకు సై వెన్నుపోటు పొడిచి మోడీకి గులాములుగా మారి ముంబైని లూటీ చేస్తున్నారని ఆరోపించారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ప్రచారం వేళ పీఎం మోడీ విదేశీ పర్యటనకు వెళ్లడం ఈ ఎన్నికల్లో బీజేపీ ఓటమిని అంగీకరించిందని విమర్శించారు.

# 'గల్ఫ్ బాధిత' కుటుంబాలకు సర్కారు అండ

మొదటి పేజీ తరువాయి

ఎన్నారై సెల్ చైర్మన్, అంబాసిడర్ డా. బీఎం వినోద్ కుమార్, కాంగ్రెస్ ఎన్నారై సెల్ కన్వీనర్ మంద భీంరెడ్డి, టీపీసీసీ గల్ఫ్ కన్వీనర్ సింగిరెడ్డి నరేశ్ రెడ్డి,గుగ్గిళ్ల.రవిలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో సుమారు రెండు వేల మంది గల్ఫ్ కార్మికులు చనిపోయారన్నారు.

## పిల్లలకు గురుకులాల్లో సీట్లు

పొట్టకూటి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లి అక్కడ మృత్యువాత పడుతున్న కార్మికుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వారి కుటుంబాలకు స్వాంతన కలిగించనున్నది. కాంగ్రెస్ సర్కార్ కొలువుదీరిన డిసెంబర్ 7, 2023 నాటి నుంచి గల్ఫ్ లో మరణించిన వారి కుటుంబాలకు రూ.5 లక్ష పరిహారం ఇవ్వనున్నారు. అలాగే గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి తీసుకోవాల్సిన చర్యలు, సవాళ్లు తదితర అంశాలపై అధ్యయనానికి సలహా కమిటీ ఏర్పాటు, ప్రత్యేకంగా ప్రవాసీ ప్రజావాణి నిర్వహించనున్నట్లు ప్రభుత్వం పేర్కొన్నది. గల్ఫ్ కార్మికుల పిల్లలకు గురుకులాల్లో సీట్ల కేటాయింపుల్లో ప్రాధాన్యం ఇస్తామని ప్రకటించింది.


## రేపు వేములవాడలో సీఎం పర్యటన

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం వేములవాడలో పర్యటించనున్నారు. రాజన్న దర్శనం చేసుకుని అక్కడ జరిగే బహిరంగ సభలో పాల్గొననున్నారు. ఆలయ అభివృద్ధి పనులతో పాటు టెక్స్‌టైల్ ఇండస్ట్రీ, ఇరిగేషన్‌కు సంబంధించిన పనులను ఆయన ప్రారంభించనున్నారు. గల్ఫ్ దేశాల్లో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు సీఎం రూ.5 లక్షల చొప్పున పరిహారం చెక్కులను అందజేయనున్నారు. సీఎం సభ ఏర్పాట్లను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పర్యవేక్షిస్తున్నారు.

## వేములవాడ ప్రజలపై వరాల జల్లు

ముఖ్యమంత్రి స్వామి వారిని దర్శించుకుని వేములవాడ పట్టణాభివృద్ధికి వరాల జల్లు కురిపించనున్నారు. బుధవారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తారు. ముఖ్యంగా వేములవాడ రాజరాజేశ్వర క్షేత్రం అభివృద్ధి కోసం రూ.127.65 కోట్లు మంజూరు చేసి, ఉత్తర్వులు జారీ చేసింది. వీటిలో శ్రీ రాజరాజేశ్వర ఆలయ కాంప్లెక్స్ విస్తరణ, భక్తులకు అవసరమైన అధునాతన సదుపాయాలకు గాను రూ.76 కోట్లు, ఆలయం నుంచి మూలవాగు బ్రిడ్జి వరకు రోడ్ల విస్తరణకు రూ.47.85 కోట్లు, మూలవాగు బతుకమ్మ తెప్ప నుంచి జగిత్యాల కమాన్ జంక్షన్ వరకు డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణానికి రూ.3.8 కోట్లు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఈ పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపనలు చేస్తారు. అలాగే కలెక్టరేట్ సమీపంలో నిర్మించిన ఎస్పీ కార్యాలయాన్ని వర్చువల్ ద్వారా ప్రారంభిస్తారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో వేములవాడలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. బుధవారం ఉదయం నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు భక్తులకు దర్శనాలు నిలిపివేశారు.

## 2025-26 నాటికి
# వందే భారత్ స్లీపర్ రైళ్లు



**న్యూఢిల్లీ, నవంబర్ 18 :** భారతీయ రైల్వేశాఖ ఎప్పటికప్పుడు ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్నది. ఇందులో భాగంగా వందే భారత్ రైళ్లను ప్రవేశపెట్టింది. ఈ సెమీ హైస్పీడ్ రైళ్లు దేశవ్యాప్తంగా వివిధ నగరాల మధ్య దూసుకెళ్లనున్నాయి. ఈ రైళ్లకు ప్రయాణికుల నుంచి మంచి ఆదరణ లభిస్తున్నది. ఈ క్రమంలోనే కొత్తగా వందే భారత్ స్లీపర్ రైళ్లను ప్రవేశపెట్టబోతున్నది. సుదీర్ఘ నిరీక్షణ అనంతరం.. 2025-26 మధ్య నాటికి భారత్‌లో వందే భారత్ స్లీపర్ రైళ్లను ప్రారంభించేందుకు సన్నాహాలు మొదలుపెట్టింది. ప్రపంచస్థాయి సౌకర్యాలు, అత్యాధునిక డిజైన్‌తో తీర్చిదిద్దిన ఈ రైళ్లు సుదూర ప్రాంతాలకు రాకపోకలు సాగించే ప్రయాణికుల కోసం రైల్వేశాఖ అందుబాటులోకి తీసుకురాబోతున్నది. ఓ నివేదిక ప్రకారం.. భారతీయ రైల్వే.. 2025-26 నాటికి పది వందే భారత్ స్లీపర్ రైళ్లను ప్రవేశపెట్టాలని యోచిస్తున్నది. భారతదేశపు తొలి వందే భారత్ స్లీపర్ రైలు ట్రయల్ రన్ తర్వాత 2025లో ప్రారంభించే అవకాశం ఉన్నది. చెన్నైకి చెందిన ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ జనరల్ మేనేజర్ సుబ్బారావు ఈ విషయాన్ని ధ్రువీకరించారు. నవంబర్ 15 నుంచి రెండునెలల పాటు రైళ్ల ఆసిలేషన్ ట్రయల్స్‌తో పాటు ఇతర పరీక్షలు నిర్వహిస్తామని.. ఆ తర్వాత కమర్షియల్ సర్వీస్‌లోకి తీసుకువస్తామని తెలిపారు. వందే భారత్ స్లీపర్ రైళ్లు ప్రయాణీకుల భద్రత, సౌకర్యానికి ప్రాధాన్యతనిచ్చేలా రైల్వేశాఖ తీర్చిదిద్దింది. ఈ రైళ్లు ఆస్తెనిటిక్ స్టెయిన్‌లెస్ స్టీల్‌తో తయారయ్యాయి. క్రాష్ బఫర్, ప్రత్యేకంగా రూపొందించిన కప్లర్‌ల వంటి అధునాతన భద్రతా పరికరాలతో అమర్చబడి ఉండనున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో ప్రయాణికులను సురక్షితంగా ఉండేలా సామర్థ్యం ఉంటుంది. ఈ స్లీపర్ రైలులో మొత్తం 16 కోచ్‌లు ఉంటాయి. 823 మంది ప్రయాణికులు ఈ రైలు ప్రయాణించేందుకు వీలుంటుంది. ఫస్ట్ క్లాస్ ఏసీ, సెకండ్ క్లాస్ ఏసీ, థర్డ్ క్లాస్ ఏసీ సౌకర్యాలు అందుబాటులో ఉంటాయి. వందే భారత్ స్లీపర్ రైలు నడిచే మార్గాలను ఇంకా ఖరారు చేయలేదు. అయితే, న్యూఢిల్లీ %-% పూణే, న్యూఢిల్లీ %-% శ్రీనగర్ తదితర మార్గాల్లో నడిపేందుకు రైల్వేశాఖ ప్రయత్నాలు చేస్తున్నది.

# ఆక్రమణలను కూల్చిన హైడ్రా

**హైదరాబాద్, నవంబర్ 18 :** రాష్ట్రంలో హైడ్రా కూల్చివేతలు మళ్లీ కొనసాగుతున్నాయి. సంగారెడ్డి జిల్లాలో సోమవారం ఉదయం మరిన్ని కూల్చివేతలను మొదలుపెట్టాయి. అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని వందనపురి కాలనీలో 848 సర్వే నంబర్‌లో ఉన్న నిర్మాణాన్ని నేలమట్టం చేశాయి. భారీ యంత్రాలతో రంగంలోకి దిగిన హైడ్రా అధికారులు అమీన్‌పూర్ పరిధిలోని పలు నిర్మాణాన్ని కూల్చివేశారు. ఈ క్రమంలో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకుండా ఉండేందుకు సమీపంలో పెద్ద ఎత్తున పోలీసులు మోహరించారు. కాగా, రహదారిని కబ్జా చేసి నిర్మాణాలు చేపడుతున్నారని కాలనీవాసులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు చర్యలు తీసుకున్నట్లు హైడ్రా అధికారులు చెబుతున్నారు.

# మూసీ పునరుజ్జీవం వద్దని కేసీఆర్ చెప్పగలరా

- అలా చెబితే.. పనులు ఆపేస్తాం
- లగచర్ల ఘటనలో అధికారులపై దాడి దారుణకాండ
- కేటీఆర్ అనుచరుల పక్కా ప్లాన్
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



**హైదరాబాద్, నవంబర్ 18 :** మూసీ పునరుజ్జీవంపై బీఆర్ఎస్ రాద్ధాంతం సృష్టిస్తోందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మండిపడ్డారు. మూసీ పునరుజ్జీవం వద్దని మాజీ సీఎం కేసీఆర్ బయటకు వచ్చ చెప్పగలరా అని సవాల్ చేశారు. అలా చెప్తే పనులు ఆపేస్తామని మంత్రి సవాల్ చేశారు. మూసీ మురికి కూపంగా ఉండాలనే వారు కోరుకుంటున్నారని మండిపడ్డారు. సబర్మతి పునరుద్ధరణ కోరుకున్న బిజెపి ఇక్కడ మాత్రం డ్రామాలు ఆడతున్నదన్నారు. వికారాబాద్ జిల్లా లగచర్లలో ఘర్షణకు దిగింది కేటీఆర్ అనుచరులేనని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆరోపించారు. అధికారులపైనే దాడికి తెగబడ్డ గుండాలు బీఆర్ఎస్‌లో ఉన్నారని అన్నారు. ఇంతకన్నా దారుణం మరోటి ఉండబోదన్నారు. గతంలో తాము కూడా ఎన్నో నిరసనలు, ఉద్యమాలు చేశామని, ఏనాడూ పోలీసులు, కలెక్టర్లపై దాడికి పాల్పడలేదన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎవరైనా శాంతియుతంగా ఆందోళన చేస్తే తప్పు లేదన్నారు. అయితే, లగచర్లలో భూములు లేని స్థానికేతరులను తీసుకొచ్చి గొడవ చేయించారని మండిపడ్డారు. నిందితుడు సురేశ్ మాజీ ఎమ్మెల్యేతో 90 సార్లు మాట్లాడారని అన్నారు. రేప్ కేసులో నిందితుడిగా ఉన్న సురేశ్ తన అనుచరుడేనని కేటీఆర్ కూడా గతంలో అంగీకరించినట్లు చెప్పారు. ఆర్ఆర్ఆర్‌కు ఇప్పటికే 90శాతం భూసేకరణ పూర్తి చేశాం. దీనికి సంబంధించి జనవరిలో టెండర్లు పిలుస్తాం. రైతులకు భూ పరిహారం చెల్లించిన తర్వాతే పనులు ప్రారంభిస్తాం. రూ. వేల కోట్లు వచ్చే ఓఆర్ఆర్‌ను కేవలం రూ.7 వేల కోట్లకే అప్పగించారు. గత ప్రభుత్వం ఆర్ఆర్ఆర్ ప్రాజెక్టును 2016 నుంచి పెండింగ్‌లో పెట్టింది. ఆర్ఆర్ఆర్ భూసేకరణకు ఇచ్చే నిధులపై కేంద్రం స్పష్టత కోరితే ఇవ్వలేదు. గత ప్రభుత్వ వైఖరి వల్ల ఈ ప్రాజెక్టుపై అడుగు ముందుకు పడలేదు. ఓఆర్ఆర్ వల్లే ఆర్ఆర్ఆర్ కూడా హైదరాబాద్, తెలంగాణకు గేమ్‌ఛేంజర్ అవుతుంది. శ్రీశైలం క్షేత్రానికి రూ.7 వేల కోట్లతో ప్రాజెక్టు సాధించనున్నాం. శ్రీశైలానికి రిజర్వ్ ఫారెస్ట్ గుండా 62 కి.మీ మేర సింగిల్ పిల్లర్ ఫ్లై ఓవర్ ప్రాజెక్టు సాకారం అవుతుంది. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మూసీ ప్రాంతానికి మాత్రమే పరిమితమయ్యారు, యాదాద్రి జిల్లాలో పర్యటించాలి. కేంద్రమంత్రిగా సింగరేణి గురించి ఎందుకు ఆలోచించటం లేదు? మణిపూర్ ఘర్షణల గురించి ఈ కేంద్ర మంత్రులు ఎందుకు మాట్లాడరని కోమటిరెడ్డి ప్రశ్నించారు.

## అదృశ్యమైన యువతి
# శవం లభ్యం

**హైదరాబాద్,నవంబర్18 :** నగరం లోని మియాపూర్‌లో అదృశ్యమైన అమ్మాయి(17) మృతదేహం లభ్య మైంది. తుక్కుగూడలోని ప్లాస్టిక్ పరిశ్రమ వద్ద మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. ఈ నెల 10న అమ్మాయి కనిపించడం లేదంటూ ఆమె తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. పోలీసులు సోమవారం మృతదేహాన్ని గుర్తించి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతురాలికి ఉప్పుగూడకు చెందిన ఓ యువకుడితో సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం ఏర్పడినట్లు పోలీసులు గుర్తించారు. ఆ యువకుడే హత్య చేసి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఆ దిశగా దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసుకు సంబంధించి ఇద్దరు మైనర్లను అదుపులోకి తీసుకున్నట్లు మియాపూర్ పోలీసులు తెలిపారు.

# భూములు పోయాక మేం ఎలా బ్రతకాలి?



మొదటి పేజీ తరువాయి

తెలిపారు. మేము ధర్నాలు చేసినప్పుడు సీఎం సోదరుడు తిరుపతి రెడ్డి, కలెక్టర్ సహా ఏ అధికారి రాలేదు.. కానీ మొన్న మాత్రం కలెక్టర్ సాధారణ దుస్తుల్లో పోలీసు సెక్యూరిటీ లేకుండా వచ్చారని పేర్కొన్నారు. దీంతో కొంతమంది పిల్లలు తెలియకుండా దాడి చేశారని చెప్పారు. ఆ దాడిని సాకుగా చూపి అర్ధరాత్రి500 మంది పోలీసులు వచ్చి, కరెంట్ బంద్ చేసి తమపై దౌర్జన్యం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కుతిక పిసికి, కళ్లకు బట్టలు కట్టి, ఇష్టానుసారం బూతులు తిడుతూ కొట్టారని కన్నీళ్లు పెట్టుకున్నారు. మగవాళ్లందరినీ అరెస్ట్ చేశారని.. మిగిలిన మగవాళ్లు ఊరు వదిలి పారిపోయారని తెలిపారు.మా భూములు ఎట్టిపరిస్థితుల్లో ఇవ్వమని లగచర్ల బాధితులు స్పష్టం చేశారు. తమ భూములను వదిలేయాలని.. తమ వారిని వదిలేయాలని కోరారు. తమకు ఉన్న మొత్తం భూమిని తీసుకుంటా అంటే ఎలా బతకాలని ప్రశ్నించారు. ఎప్పుడు పోలీసులు వచ్చి ఏం చేస్తారోనని.. ఇంట్లో ఉండాలంటేనే భయం వేస్తోందని చెప్పారు. తమ ఇంట్లో ఉన్న మగవాళ్లందరినీ తీసుకెళ్లారని%% ఎనిమిది రోజులుగా తమ పిల్లలు ఎక్కడున్నారో తెలియదని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ ఉన్నప్పుడు మేము చాలా బాగా బతికామని.. 9 నెలలుగా తీవ్రంగా ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. తమమా ప్రాణాలు పోయినా సరే ఫార్మా కంపెనీకి భూములు ఇవ్వమని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డిని కలిసేందుకు వెళ్తే తమను బెదిరించి పంపించారని చెప్పారు.

# సీఎం ఎంత దుర్మార్గుడో తెలుస్తుంది

### మాజీ మంత్రి సత్యవతి రాథోడ్

**హైదరాబాద్, నవంబర్ 18 :** సీఎం సొంత నియోజకవర్గంలో గిరిజనులపై అఘాయిత్యాలకు పాల్పడ్డారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ ఆరోపించారు. ఎన్నో ఏళ్లుగా ఆ భూములను ఆధారంగా చేసుకొని బతుకుతున్న వారి జీవనాధారాన్ని గుంజుకునే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. లగచర్లలో అర్ధరాత్రి సమయంలో పోలీసులు సృష్టించిన అరాచకంపై బాధితులు ఢిల్లీలోని జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మాలోతు కవితతో కలిసి ఆమె మీడియాతో మాట్లాడారు. గత 9 నెలలుగా తమ భూములు ఇవ్వమని లగచర్ల రైతులు చెబుతునే ఉన్నారని సత్యవతి రాథోడ్ అన్నారు. భూములు తీసుకుంటామంటే ఆవేశంలో కొంతమంది దాడి చేశారని చెప్పారు. దాన్ని సాకుగా చూపి మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడ్డారని మండిపడ్డారు. అర్ధరాత్రి కరెంట్ తీసేసి, ఇంటర్ నెట్ బంద్ చేసి మహిళలను హింసించారని.. కొట్టారని.. బూతులు తిట్టారని అన్నారు. 51 మంది రైతులపై అక్రమ కేసులు పెట్టారని.. ఊళ్లో ఉన్న మగవాళ్లంతా పారిపోయారని చెప్పారు. బాధితులకు ఉరి శిక్ష పడుతుందని రేవంత్ రెడ్డి సోదరుడు బెదిరిస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రపతి కూడా ఆదివాసీ బిడ్డే అని.. ఆమె మాకు సమయం ఇస్తే వారికి సంఘటనను వివరిస్తాని తెలిపారు. కొద్ది రోజులుగా బాధితుల ఆవేదన చూస్తుంటే కడుపు తరుక్కుపోతోందన్నారు. ల గచర్ల బాధితులందరికీ బీఆర్ఎస్ తరపున అండగా ఉంటామని తెలిపారు. వారస త్వంగా వచ్చిన భూములను ఫార్మా కంపెనీ ఇవ్వాలని అంటున్నారని కవిత అన్నారు. ఫార్మా సిటీ కోసం గత ప్రభుత్వం ఇప్పటికే భూములు సేకరించిందని.. దాన్ని కాదని గిరిజనుల భూములను లాక్కుంటున్నాడని మండిపడ్డారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
మంగళవారం
19 నవంబర్
2024




# జనాభా పెరుగుదలతో వనరుల కొరత!



జనాభా పెరుగుదల వనరులకు ముప్పుగా పరిణమించనుంది. ఆరత్లాంటి దేశాలు ఇప్పటికే జనాభాతో సమస్యలు ఎదర్కొంటోంది. మేమిద్దరం..మాకిద్దరు.. అన్న నినాదం చాలా పాతది. మళ్లీ ఇప్పుడు ఆ నినాదాన్ని విధానంగా తీసుకుని ముందుకు సాగాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. జనాభా నియంత్రణ అన్నది అన్ని వర్గాలకు,కులాలకు సమానంగా ఉండాలి. దీనిలో నియంత్రణఅన్నది ఉండరాదు. దీనికితోడుయువత జనాభాతగ్గుతోందన్న ఆందోళన కూడా ఉంది. జనాభా నియంత్రణ అత్యవసర, తక్షణ చర్యగా మారాలి. కేంద్ర,రాష్ట్రాలు జనాభా నియంత్రణకు తక్షణ చర్యలు తీసుకోవాలి. జనాభా నియంత్రణ అన్నది దేశ విశాల ప్రయోజన చర్యగా గుర్తించాలి. ఇందులో ఎలాంటి భేషజాలకు పోరాదు. ఎలాంటి బుజ్జగింపులకు తావుండరాదు. అలాగే మతాల ఆధారంగా జనాభాపై ఆంక్షలుఉండరాదు. దేశంలో జన విస్ఫోటనంతో ఇప్పటికే ఆహారభద్రత ఆందోళనకరంగగా మారింది. నిరుద్యోగం పెరిగుతోంది. వనరులు రోజురోజుకూ హరించుకుపోతున్నాయి. ఆహారధాన్యాలు ఉత్పత్తి అవుతున్నా ఆకలిగొన్నవారు కోట్లలోనే ఉంటున్నారు. ఉన్నవారికే తిండీగుడ్డా, గూడు లేకుండా పోతుంది. ప్రపంచ జనాభా **800** కోట్లకు చేరడం ఒక ఎత్తయితే మనదేశ జనాభా మరింతగా పెరిగి చైనాను అధిగమించింది. దాదాపు **140** కోట్లు అంటున్నా ...**145** కోట్లు ఉండవచ్చని అంచనా.రానున్న జనాభా లెక్కల సేకరణలో ఇది మరింత స్పష్టత రానుంది. జనాభా పెరుగుదలపై ఐక్యరాజ్యసమితి లెక్కలు ఆందోళన కలిగించేవిగా ఉన్నాయి. దీనికితోడు పట్టణీకరణతో ప్రకృతి ధ్వంసం అవుతోంది. కాలుష్యం పెరుగుతోంది. సహజవనరులపై దాడి జరుగుతోంది. జనాభా నియంత్రణపై దేశంలో ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. గతంలో ఇద్దరు లేక ముగ్గురు అన్న నినాదం బాగా ప్రాచర్యం అయ్యింది. ఇకపోతే పెరుగుతున్న జీవనప్రమాణాల కారణంగా మరణాల రేటు కూడా తగ్గుతోంది. దీంతో వృద్ధుల సంఖ్య కూడా పెరుగుతోంది. ఈక్రమంలో దేశంలో ఆహారకొరత రాకుండా చూసుకోవాలి. వనరులు దెబ్బతినకుండా చూసుకోవాలి. ఉన్నవారందరికి గాలి,నీరు సక్రమంగా అందుతుందా లేదా అన్నది కూడా అంచనా వేసుకోవాలి.

**జనభా పెరుగుదల మానవాళి చరిత్రలో ఓ మైలురాయిగా మారిన నేపథ్యంలో నియంత్రణ కూడా మనచేతుల్లోనే ఉందని గుర్తించి ముందుకు సాగాలి. పేద దేశాల్లో జనాభా గరిష్ట స్థాయిలో పెరుగుతూ ఉంటే, ధనిక దేశాల్లో దీనికి భిన్నమైన స్థితి! 800 కోట్ల జనాభాలో ఆసియా, ఆఫ్రికా దేశాలదే సింహభాగం. దానిలోనూ మన దేశానిదే పైచేయి. గడిచిన పన్నెండేళ్ల లో భారత్‌లో 17.7 కోట్ల మంది పెరగగా, చైనాలో 7.3 కోట్ల మంది పెరిగారని ఐక్యరాజ్యసమితి ఇప్పటికే పేర్కొంది.**

**2050** నాటికి **170** కోట్ల జనాభాతో భారత్ తొలి స్థానానికి, అదే సమయంలో చైనా జనాభా **130** కోట్లకు పరిమితం కానుందని అంచనా! ప్రపంచ జనాభా **2037** నాటికి **900** కోట్లకు, **2058** నాటికి వెయ్యి కోట్లకు, **2080** నాటికి **1400** కోట్లకు చేరుతుందని భావిస్తున్నారు. ఈలెక్కల అంచనాల మేరకు భారత్‌లోనే జన విస్ఫోటనం విపరీతంగా ఉంది. దీనిని అభివృద్ధిగా కంటే తిరోగమనంగానే చూడాలి. జనాభాను పెంచుకుంటూ పోతే వారికి తినడా నికి తిండికూడా పెట్టలేని దౌర్భాగ్యానికి చేరుకోగలమని గుర్తించాలి. ఎవరికి వారు దీనిపై నియంత్రణ పాటించాలి. భూగోళం మీద జీవం ఉనికి ప్రారంభమైనప్పటి నుండి ఈ స్థాయిలో పురోగతి సాధించిన మరో జీవి లేదనడం అతిశయోక్తి కాదు. జంతువుల్లో జంతువుగా మనుగడ కోసం పోరాడిన స్థితి నుండి బుద్ధిజీవిగా మారేంత వరకు మానవజాతి సాగించిన ఈ ప్రయాణం అనితర సాధ్యం! ఈ క్రమంలోనే భూగోళమంతా మనుషులు విస్తరించారు. భిన్న వాతావరణ పరిస్థితులను, ప్రకృతి వైపరీత్యాలను ఎదర్కొని ముందుకు సాగతున్నారు. అయితే, ఈ విస్తరణ భూగోళమంతా ఒకే మాదిరి జరగలేదు. ఒక్కో ప్రాంతంలో ఒక్కో విధంగా జరిగింది. మనుగడ పోరాటంలో భాగంగా మనిషి సాగించిన వలసలూ జనాభా సంఖ్యను ప్రభావితం చేశాయి. నాగరికత పెరిగిన తరువాత పేదరికం కూడా కుటుంబాలలో సభ్యుల సంఖ్యను ప్రభావితం చేసింది. సంతానం ఎక్కువుంటే సంపాదించే వారి సంఖ్య పెరుగుతుందని అనుకోవడం ఇప్పటికీ వింటూనే ఉంటాం. ఐక్యరాజ్య సమితి తాజాగా విడుదల చేసిన నివేదిక కూడా ఇదే విషయాన్ని చెబుతోంది. జనాభా ఈ స్థాయికి చేరుకోవడం మానవాళికి వరమా..శాపమా అన్న లెక్కలు వేసుకుని, అందుకు అనుగుణంగా ప్రభుత్వాలు ఎటువంటి విధానాలు అవలంబించాలన్నది చర్చచేయాలి. జనాభా విస్ఫోటనం తీవ్ర ఆందోళన కలిగించే అంశం. చైనాలో ఒకప్పుడు వన్ ఆర్ నన్ నినాదం ఇచ్చిన ఆ దేశ ప్రభుత్వం జనాభాను నియంత్రించగలిగింది. ఇప్పుడు ఒకరు, లేదా ఇద్దరు అంటున్నట్లు వార్తలు వస్తున్నాయి. కొన్ని దేశాల్లో పిల్లలను ఎక్కువగా కనేవారికి అక్కడి ప్రభుత్వాలు అనేక రాయితీలు కల్పిస్తున్నాయి. రష్యాలాంటి చలిదేశాల్లో ఇది ఆహ్వానించదగ్గదే. ప్రస్తుతం మన దేశంలో యువకుల సంఖ్య అత్యధికంగా ఉంది. మరో యాభై ఏళ్ళ తరువాత ఇదే స్థితి ఉంటుందన్న గ్యారంటీ లేదు. పిల్లలను కనాలా..వద్దా అన్నది భార్యాభర్తలే నిర్ణయించుకుంటారు. అయితే ఎంతమందిని కనాలన్నది ప్రభుత్వం నిర్ణయించాలి. దేశంలోని వనరులను, ఆర్థిక స్థితిగతులను బట్టి జనాభా నియంత్రణ ఇప్పుడే తక్షణావసరమైన చర్యగాచూడాలి. పిల్లలను కంటూ పోతే అటు తల్లికి, ఇటు దేశానికి తీరని నష్టం వాటిల్లగలదు. తల్లి ఆరోగ్యం దెబ్బతిన్నట్లుగానే దేశసౌభాగ్యం కూడా దెబ్బతినగలదు. అందువల్ల దేశంలో ఏకీకృత జనాభా విధానం రావాలి. జనాభా నియంత్రణ అన్నది నిరంకుశంగా మారాలి. కొన్నేళ్ల పాటు ఇలా చేస్తూ పోతే తప్ప మన జానాభాను అదుపులో పెట్టుకోలేం. ఇందుకు కేంద్రం తక్షణంగా స్పందించాలి. తక్షణ చర్యలు చేపట్టాలి. జనాభా నియంత్రణ అన్నది యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలి. ఇందుకు కఠిన చర్యలకు ఉపక్రమించాలి. అలాగే ఇందుకు చట్టం చేసి ముందుకు సాగితేనే దేశం పురోగమించగలదు. యువతను ఇందుకు అనుగుణంగా చైతన్యం చేయాలి.

# నిరీక్షణాలో మత మార్పిడులు

## అనాధాశ్రమ నిర్వహణ ముసుగులో మైనర్ బాలలను మతమార్పిడి చేస్తున్న ఆశ్రమ నిర్వాహకుడు

భువనగిరి, రోమింగ్ న్యూస్:

భువనగిరి పట్టణంలో 2013 నుండి నిరీక్షణ హోమ్ పేరు తో ప్రభుత్వ అనుమతితో అనాధ తప్పిపోయిన, వదిలివేయబడిన బాలల కోసం సంరక్షణలయం నిర్వహించడం జరుగుతుంది. ఇట్టిహోముల్లో మొత్తం 14 మంది బాలలు ఉండగా వారిలో బాలురు మరియు బాలికలు ఒకే ప్రాంగణంలో ఉండరాదని గత ఆగస్టు మహాసములో ఆడపిల్లలను మరొక హోమ్ కు తరలించడం జరిగినది. అదేవిధంగా ప్రస్తుతం ఇట్టి హోంకు ఎలాంటి లైసెన్సు లేకుండా బాలురను పెట్టుకొని హోం నిర్వహిస్తుండడం మహిళా శిశు సంక్షేమ శాఖ నిర్లక్ష్యానికి నిదర్శనం. ఇప్పటికైనా ఆ హోమ్ లో ఉన్న బాలురను అక్కడ నుండి తరలించి వారికి రక్షణ చర్యలు చేపట్టవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నది. వీరంతా ఆశ్రమంలో చేరినప్పుడు ఒక వర్గం వారు అయినప్పటికీ ఇట్టి పిల్లల పేర్లు మార్చి మతమార్పిడి చేసినట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇట్టి విషయంపై బాలల సంక్షేమ సమితి పిల్లలను మత కార్యకలాపాలలో భాగస్వామ్యులను చేయవద్దని తెలియపర్చినా గుట్టుచప్పుడు కాకుండా వారి అనుమతి లేకుండా హైదరాబాద్ మరియు ఇతర ప్రాంతాలలో మత ప్రార్థనలలో పిల్లలను భాగస్వామ్యం చేస్తున్నట్లు తెలియ వచ్చింది.ఇది చట్ట విరుద్ధమని తెలపడంతో మీరు మమ్ములను వేధిస్తున్నారని మీ అంతు చూస్తామని మెట్రోపాలిటన్ మేజస్ట్రేట్ పవర్స్ కలిగిన కమిటీనే బెదిరిస్తున్నట్లు తెలియ వచ్చింది. అదేవిధంగా ఆశ్రమంలో 10 సంవత్సరాలు పైబడిన బాలురు బాలికలు ఒకే ప్రాంగణంలో ఉండరాదని బాలల న్యాయ చట్టం -2015 ప్రకారం చెపుతున్నప్పటికీ ఇట్టి విషయాన్ని నిర్లక్ష్యం చేయడంతో బాలల సంక్షేమ సమితి జిల్లా న్యాయ సేవాదికార సమితి మరియు జిల్లా కలెక్టర్ గార్లు జిల్లా పరిశీలనా కమిటీ సూచనల మేరకు బాలికలను ఇతర ఆశ్రమంలోకి మార్చడం జరిగింది.ఇట్టి విషయంపై బాలల సంక్షేమ సమితి చైర్మన్ మరియు సభ్యుల అంతు చూస్తామని మీరు ఏ విధంగా విధులు నిర్వర్తిస్తారో చూస్తానని బెదిరిస్తూ సోషల్ మీడియాలో కమిటీ వారి పై అసత్య ప్రచారాలు నిర్వహిస్తున్నట్లు తెలియ వచ్చింది. ఇట్టి ఆశ్రమంలో ఉన్న బాలలంతా అనాధ మరియు వదిలివేయబడ్డ బాలలు వీరందరినీ తప్పకుండా బాలల న్యాయ చట్టం మరియు %జూా=ూా% గైడ్లెన్స్ ప్రకారం తప్పనిసరిగా దత్తత ప్రక్రియలోకి తీసుకురావలసి ఉన్నది.కానీ ఆశ్రమ నిర్వాహకుడు ఇన్ని సంవత్సరాలు పిల్లలకు మాయ మాటలు చెప్పి దత్తతకు వెళ్లకుండా అనాధలుగా మిగిలిపోయే విదంగా చూడడం జరిగినది.అయితే బాలల న్యాయ చట్టం సెక్షన్ 66 (3) ప్రకారం బాలలను దత్తత ప్రక్రియలోకి తీసుకురాకుండా అడ్డుకున్నట్లయితే ఆశ్రమ నిర్వాహకుడి కి ప్రతి ఒక్క కేసుకు 50 వేల రూపాయల జరిమానా మరియు చట్టపరమైన శిక్షకు గురికావలసి వస్తుంది. కానీ ఇవి ఏవి పట్టనట్లు ఆశ్రమ నిర్వాహకుడు తన స్వార్థం కోసం పిల్లలను దత్తత వెళ్లితే మిమ్ములను దత్తత తీసుకున్న వారు పనులలో పెడతారని మీరు దత్తత వెళ్ళమని అధికారులకు చెప్పమని చెప్పి పిల్లల తో చెప్పించినట్లు తెలియవచ్చింది.పిల్లలను సాకుతున్నట్లు చూపిస్తూ విదేశాల నుండి లక్షల సొమ్ము స్వాహా చేస్తున్నట్లు తెలియ వచ్చింది.ఆశ్రమం లోని పిల్లలను పాఠశాలకు తీసుకెళ్ళడానికి దాతలు 40 లక్షల విలువ కలిగిన ఏసీ బస్ ను డొనేట్ చేయగా అట్టి వాహనాన్ని ఈ బాలలకు ఉపయోగించకుండా నల్గొండ రూట్ లో గల కార్పొరేటు పాఠశాలకు అద్దెకు ఇచ్చి సొమ్ము కాజేస్తున్నట్లు తెలియవచ్చింది.ప్రతి సంవత్సరం ఆశ్రమ నిర్వాహకుడు ఆడిట్ రిపోర్టు ప్రభుత్వానికి సమర్పించవలసి ఉన్నా ఫేక్ ఆడిట్ రిపోర్టు సబ్మిట్ చేస్తున్నట్లు తెలియ వచ్చింది. ఇట్టి ఆశ్రమంపై పూర్తి దర్యాప్తు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టవలసిందిగా సామాజిక కార్యకర్తలు కోరడం జరిగింది. ఆశ్రమంలో బాలలకు సంబంధించి ఎలాంటి డాక్యుమెంట్స్ చూపించకుండా పిల్లలను విదేశాలకు ఎగుమతి చేయడం కోసం మతమార్పిడి చేసి పోస్టర్ కేర్ తీసుకొని విదేశాలకు పిల్లలను ఎగుమతి చేయడం కోసం ప్రయత్నిస్తున్నట్లు తెలియ వచ్చింది. ఇట్టి విషయం పై తక్షణ మే తగిన విచారణ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోని యడల విశ్వ హిందూ పరిషత్ భువనగిరి వారు భారీ ఆందోళన చెప్పట్టనున్నట్లు ఒక ప్రకటన లో తెలిపారు.ఇప్పటికైనా ఆశ్రమంలో ఉన్న బాలురను అతని కబంధ హస్తాల నుండి విడిపించి ఆశ్రమ నిర్వాహకునిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా సామాజిక కార్యకర్తలు,విశ్వ హిందూపరిషత్ కార్యకర్తలు డిమాన్డ్ చేయడం జరిగింది. ఇట్టి విషయంపై జిల్లా కలెక్టర్ గారికి మరియు మహిళా సంక్షేమ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

# కార్యనిర్వహణాధికారి బాధ్యతల స్వీకరణ



శ్రీశైలం నవంబర్ 18 రోమింగ్ న్యూస్ : దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా నియమితులైన శ్రీ ఎస్.ఎస్.చంద్రశేఖర ఆజాద్ పరిపాలనా భవనములో అధికార బాధ్యతలను స్వీకరించారు. ఇంఛార్జి కార్యనిర్వహణాధికారి శ్రీ ఈ. చంద్రశేఖరరెడ్డి నుండి వీరు అధికార బాధ్యతలను స్వీకరించడం జరిగింది. కాగా అధికార బాధ్యతల స్వీకరణకు ముందు వారు ఆలయములో శ్రీస్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పలువురు విభాగాధిపతులు, సిబ్బంది నూతన కార్యనిర్వహణాధికారివారికి శుభాభినందలు తెలియజేశారు. అనంతరం కార్యనిర్వహణాధికారివారు మాట్లాడుతూ శ్రీస్వామిఅమ్మవార్ల అనుగ్రహంతో తనకు కార్యనిర్వహణా ధికారివారిగా బాధ్యతలు నిర్వహించే అవకాశం లభించిందన్నారు. శ్రీ స్వామిఅమ్మవార్లను సేవించుకునే భాగ్యం కలగడం తన అదృష్టంగా భావిస్తున్నాని అన్నారు. కార్యనిర్వహణాధికారిగా అటు స్వామిఅమ్మవార్లను, ఇటు భక్తులను సేవించుకునే అవకాశం తనకు లభించిందన్నారు. గౌరవ ముఖ్యమంత్రివర్యులు, గౌరవ దేవదాయశాఖావాత్యులు, స్థానిక గౌరవ శాసనసభ్యుల వారు శ్రీశైలక్షేత్రాన్ని మరింతగా అభివృద్ధి చేయాలనే ప్రగాఢ సంకల్పంతో ఉన్నారన్నారు.తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో శ్రీశైలక్షేత్రాన్ని అభివృద్ధి చేయాలనే కృతనిశ్చయంతో వారు ఉన్నట్లుగా ఆయన పేర్కొన్నారు. వారి సూచనలతో మరియు ఉన్నతాధికారులు, దేవస్థానం సిబ్బంది సహకారముతో శ్రీశైలక్షేత్రాన్ని మరింతగా అభివృద్ధి చేసేందుకు తగు చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా శ్రీస్వామిఅమ్మవార్లకు ఆయా కైంకర్యాలన్నీ ఆగమశాస్త్రాలను అనుసరించి సంప్రదాయబద్ధంగా నిర్వహింపజేసేందుకు అర్చకస్వాములు, వేదపండితుల సహకారంతో కృషి చేయడం జరుగుతుందన్నారు. అదేవిధంగా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా వారికి సౌకర్యవంతమైన దర్శనాలను కల్పించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. శ్రీశైలక్షేత్ర సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణపట్ల ప్రత్యేక శ్రద్ధ కనబర్చడం జరుగుతుందని అన్నారు సనాతన ధర్మ పరిరక్షణలో భాగంగా గో సంరక్షణ, ధర్మప్రచారం మొదలైన కార్యక్రమాలను మరింతగా చేపట్టనున్నట్లుగా ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా చెంచుగూడెములకు దేవస్థానం ధర్మప్రచార రథాన్ని పంపి, శ్రీస్వామిఅమ్మవార్ల కల్యాణోత్సవాలను జరిపించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా పర్యావరణ పరిరక్షణకు మరియు క్షేత్రసుందరీకరణలో భాగంగా పచ్చదనాన్ని పెంపొందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. సిబ్బంది అందరు కూడా జవాబుదారితనంతో పారదర్శకంగా విధులు నిర్వహిస్తూ దేవస్థానం అభివృద్ధికి పాటుపడాలన్నారు.

# రైతులపై అక్రమ కేసులు ఎత్తివేయాలి

## జనగామలో గిరిజన నాయకుల డిమాండ్.. ముందస్తు అరెస్ట్



**జనగామ, నవంబర్ 18: (రోమింగ్ న్యూస్) :** వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం లో దుద్యాల మండలం లో గిరిజన రైతులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ జనగామ జిల్లా కేంద్రంలో సోమవారం ఉదయం గిరిజన నాయకులు డిమాండ్ చేశారు. చలో హైదరాబాద్ పేరిట పిలుపునిచ్చిన నేపథ్యంలో జనగామ జిల్లా నాయకులు ఎల్ హెచ్ పి ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అజ్మీర స్వామి నాయక్ , సేవలాల్ సేన జిల్లా అధ్యక్షులు శంకర్ నాయక్ ,ఎల్ హెచ్ పి ఎస్ జిల్లా నాయకులు అజ్మీర కనకరాజు, ధరంసత్ కొమురవెల్లి భానోత్ వెంకటేష్ తదితరులను ముందస్తు గా సోమవారం అరెస్టు చేసి జనగామ పోలీస్ పోలీస్ స్టేషన్ తరలించారు. ఈ సందర్భంగా గిరిజన నాయకులు రోమింగ్ న్యూస్ తో మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న వ్యవసాయ భూములను ఫార్మా కంపెనీ కోసం అక్రమంగా నిబంధన విరుద్ధంగా కంపెనీ కోసం రైతుల నుండి బలవంతంగా భూ సేకరణ చేస్తున్న సందర్భంగా జరిగిన సంఘటనల నేపథ్యంలో గిరిజన రైతుల పైన అక్రమ కేసులు పెట్టడం అన్యాయమని వారు ఆవేదన వ్యక్తం చేశారు అమాయక గిరిజన రైతులపై ప్రభుత్వం అక్రమంగా పెట్టించిన కేసులు అన్నింటిని ఎత్తివేయాలని వారు డిమాండ్ చేశారు కంపెనీల పేరుతో భూమిని లాక్కోవాలని చేస్తున్న చర్యలను వెంటనే మానుకోవాలని చలో గాంధీ భవన్ కు పిలుపునివ్వడంతో ముందస్తుగా నాయకులను అరెస్టు చేస్తే ఉద్యమం ఆగదు అంటూ గిరిజన నాయకులు పేర్కొన్నారు.

# జనగామలో గ్రూప్- 3 పరీక్షలకు 3 వేల మంది హాజరు

## బందోబస్తు.. సజావుగా సాగిన పరీక్షలు

జనగామ నవంబర్ 18:( రోమింగ్ న్యూస్) : జనగామ జిల్లా కేంద్రంలో నిర్వహించిన గ్రూప్ త్రీ పరీక్షలలో 3 వేల 80 మంది హాజరైనారు. సోమవారం జనగామ జిల్లా కేంద్రం లోని జనగామ మున్సిపాలిటీ లో రెండవ రోజు గ్రూప్ -3 కేంద్రాల లో కలెక్టర్ రిజ్వాన్ భాషా పర్యటిస్తూ ధర్మకంచ లో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల , నెహ్రూ పార్క్ లోని సెయింట్ పాల్ హై స్కూల్ లలో ఏర్పాటు చేసిన గ్రూప్ -3 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. జనగామ ఏ ఏ సి పి పార్థసారథి ఆధ్వర్యంలో పోలీసులు ఏర్పాటుచేసిన ప్రతిష్ట బందోబస్తు మధ్య పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ధర్మకంచ లోని కళాశాలలో 240 మందికి 67 గైరు హాజరు కాగా 173 మంది పరీక్షలు రాసినట్లు అధికారులు తెలిపారు . అదే విధంగా సెయింట్ పాల్ హై స్కూల్లో 336 మందికి గాను 97మంది గైరు హాజరు కాగా 239మంది పరీక్షకు హాజరైనట్లు వివరించారు. మొతంగా 5,446 మందికి గాను 2366 గైరు హాజరు కాగా 3080 మంది పరీక్షకు హాజరైనట్లు తెలియజేసారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ గోపిరామ్, హౌసింగ్ ఈఈ దామోదర్, ఎస్సి కార్పొరేషన్ ఈడీ మాధవి లత, ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.పావని కుమారి, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏ. డి మన్యం కొండ, పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ దేవకుమార్ పాల్గొన్నారు.






# హైదరాబాద్ కు తరలించిన గ్రూప్-3 పరీక్ష పత్రాలు

### జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్

సోమవారం, జిల్లాలో గ్రూప్-3 పరీక్ష (పేపర్-1, 2, 3) సజావుగా జరిగాయని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని స్ట్రాంగ్ రూంలో భద్రపరిచిన ఓఎంఆర్ జవాబు పత్రాలను పోలీసుల పర్యవేక్షణలో ప్రభుత్వ వాహనంలోకి ఎక్కించి, సీల్ వేసి అత్యంత జాగ్రత్తగా హైదరాబాదులోని టీజీపీఎస్సీ కార్యాలయానికి తరలించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ పార్థసారథి, డీఈఓ రాము, సంబంధిత అధికారులు, పోలీసులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఫార్మా కంపెనీలే ముఖ్యమా?

**మొదటి పేజీ తరువాయి**

ఎంపీ డీకే అరుణ అన్నారు. బలవంతంగా భూములు లాక్కుంటామని అధికారులు చెప్పడంతో రైతులు ఆగ్రహానికి గురయ్యారని పేర్కొన్నారు. రైతులు ప్రజాభిప్రాయ సేకరణను బహిష్కరించారని చెప్పారు. వాస్తవంగా ప్రజాభిప్రాయ సేకరణకు రాకపోతే కలెక్టర్ ఒక్కరే ఎందుకు వెళ్లారని ప్రశ్నించారు. పోలీసుల వైఫల్యంతోనే లగచర్ల ఘటన జరిగిందని డీకే అరుణ అన్నారు. సీఎం రేవంత్ సోదరుడు అక్కడ ఉన్న రైతులను భయపెట్టారని తెలిపారు. భూములు ఎలాగైనా గుంజుకుంటామని చెప్పారన్నారు. ఘటన తర్వాత రాత్రి గ్రామాల్లోకి వచ్చి పోలీసులు ఇష్టం వచ్చినట్టు దాడి చేశారని పేర్కొన్నారు. గొడవ జరిగిన ఘటనలో కాంగ్రెస్ పార్టీ వాళ్లను వదిలేసి మిగతా వాళ్లను అరెస్ట్ చేశారని అన్నారు. భూములు ఇవ్వమని చెబితే సీఎం రేవంత్ స్వయంగా వెళ్లి వాళ్లను కలిసి మాట్లాడితే బాగుండేదని అన్నారు. కానీ ఇవన్నీ చేయకుండా భయపెట్టి దాడులు చేపించి ఇలా చేయడం కరెక్ట్ కాదని స్పష్టం చేశారు. సీఎం సోదరుడు అక్కడికి



వెళ్ళవచ్చు కానీ నన్ను అక్కడికి వెళ్లకుండా ఎందుకు అడ్డుకున్నారని డీకే అరుణ ప్రశ్నించారు. రైతులతో దౌర్జన్యంగా బెదిరించి సంతకాలు పెట్టించుకుంటున్నారని తెలిపారు. మీరు సీఎం అయితే మా నియోజకవర్గం బాగుంటుందని అనుకుంటే మీరు జనాలపై కక్ష కట్టారన్నారు. సీఎంకు ఫార్మా కంపెనీలపై అంత ప్రేమ ఎందుకని నిలదీశారు. ఓటేసి గెలిపించిన జనాల కాంటే మీకు ఫార్మా కంపెనీ ముఖ్యమా అని సీఎం రేవంత్ రెడ్డి నిలదీశారు. సీఎం కొడంగల్ వాసులు కాదు వలస వచ్చారని డీకే అరుణ తెలిపారు. మీకు నచ్చిన వారికి కంపెనీలు అప్పజెప్పడానికే ఫార్మా కంపెనీలు పెడుతున్నారని మండిపడ్డారు. వెంటనే లగచర్ల బాధితులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పంథాలు వద్దని.. నియోజకవర్గ ప్రజల ఆకాంక్ష ముఖ్యమని అన్నారు. గర్భిణీ స్త్రీ అని చూడకుండా ఇలా చేయడం దారుణమని అన్నారు. సీఎం రేవంత్ అహంకారం వీడాలని.. ఒప్పించి భూములు తీసుకోవాలని సూచించారు.

## మాజీ మంత్రి హరీశ్‌రావు నా ఫోన్ ట్యాప్ చేశారు

### డీజీపీ, జూబ్లీహిల్స్ ఏసిపికి చక్రధర్‌గౌడ్ ఫిర్యాదు



**హైదరాబాద్, నవంబర్ 18 :** రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణ కొనసాగుతోంది. ఫోన్ ట్యాపింగ్‌పై గతంలో డీజీపీకి, జూబ్లీహిల్స్ ఏసిపికి చక్రధర్ గౌడ్ అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. తన ఫోన్ ట్యాపింగ్ అయినట్లు అలర్ట్ మెసేజ్ వచ్చిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. చక్రధర్ గౌడ్ ఫిర్యాదుపై గతంలో రెండుసార్లు పోలీసులు విచారణ చేశారు. బీఆర్ఎస్ నేత మాజీ మంత్రి హరీష్‌రావు తన ఫోన్ ట్యాప్ చేయించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. సోమవారం మరోసారి విచారణకు రావాలని పోలీసులు ఆదేశించడంతో జూబ్లీహిల్స్ ఏసిపి ముందు చక్రధర్ గౌడ్ విచారణకు హాజరయ్యారు. ఆయన వద్ద ఉన్న ఆధారాలను పోలీసులు పరిశీలించి విచారణ చేశారు. ఈ సందర్భంగా సిద్దిపేటకు చెందిన చక్రధర్ గౌడ్.. కాంగ్రెస్ నాయకుడు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వంలో తన ఫోన్ ట్యాపింగ్ అయిందని, తన ఫోన్ ట్యాపింగ్ అయినట్లు ఆపిల్ కంపెనీ ద్వారా తనకు అలర్ట్ మెసేజ్ వచ్చిందని, దీనిపై గతంలో డీజీపీకి ఫిర్యాదు చేశానని తెలిపారు. గంటన్నర పాటు పోలీసులు విచారణ జరిపి.. స్టేట్‌మెంట్ రికార్డ్ చేశారన్నారు. అప్పటి టాస్క్‌ఫోర్స్ డిసిపి రాధాకిషన్‌రావు బీఆర్ఎస్ పార్టీలో చేరి హరీష్ రావుకు సరెండర్ అవ్వాలని... లేకపోతే అక్రమ కేసులు పెడతామని బెదిరింపులకు దిగారన్నారు. తన వ్యక్తిగత ఫోన్‌తో పాటు తన భార్య, డ్రైవర్, తమ కుటుంబ సభ్యుల ఫోన్లు అన్ని ట్యాపింగ్ చేశారని పేర్కొన్నారు. పోలీసులు అడిగిన ప్రశ్నలకు తాను సమాధానం ఇచ్చానని, మేము చెప్పినట్లు వినకపోతే తన కుటుంబాన్ని అంతం చేస్తామంటూ అప్పటి ట్రాన్స్‌పోర్టు డిసిపి రాధా కిషన్ రావు బెదిరింపులకు దిగారని చెప్పారు. ఫోన్ ట్యాపింగ్‌పై హైకోర్టులో పిటిషన్ వేసి పోరాటం చేస్తున్నానని, న్యాయం జరగకపోతే సుప్రీంకోర్టులో కూడా పిటిషన్ వేసి పోరాటం చేస్తానని చక్రధర్ గౌడ్ స్పష్టం చేశారు. కాగా ఫోన్ టాపింగ్ కేసులో రాధాకృష్ణన్ రావు, భుజంగరావు బెయిల్ పిటిషన్‌పై సోమవారం హైకోర్టు విచారణ జరగనుంది. ఇప్పటికే రెండు సార్లు బెయిల్ పిటిషన్ నాంపల్లి కోర్టు కొట్టివేసింది. భుజంగరావు, రాధాకృష్ణన్ రావులు ప్రస్తుతం చంచల్ గూడ జైల్లో ఉన్న విషయం తెలిసిందే. కాగా సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ శనివారం పోలీసుల విచారణకు హాజరయ్యారు. జూబ్లీహిల్స్ ఏసీపీ నేతృత్వంలోని బృందం ఆయనను విచారించింది. విచారణ సాంతం మాజీ అదనపు ఎస్పీ తిరుపతన్న కాల్ లిస్ట్ చుట్టూ తిరిగింది. "మీరు తిరుపతన్న మొబైల్ ఫోన్‌కు రెండు ఫోన్ నంబర్లు పంపించారు. వాటిని ఎందుకు పంపారు.." అని ప్రశ్నించినట్లు తెలిసింది. రెండు గంటల పాటు విచారణ కొనసాగింది. కాగా.. ఈ కేసులో ఇటీవలే మరో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యను పోలీసులు విచారించిన విషయం తెలిసిందే.. లింగయ్య ఇచ్చిన రెండు నంబర్లను తిరుపతన్న ట్యాప్ చేసినట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. ఎమ్మెల్యే వేముల వీరేశం అనుచరులు మదన్‌రెడ్డి, రాజ్‌కుమార్ ఫోన్లను తిరుపతన్న ట్యాప్ చేసినట్లు నిర్ధారణ కావడంతో.. పోలీసులు లింగయ్యను మరోమారు విచారించే సూచనలు కనిపిస్తున్నాయి. ఒకరిద్దరు మాజీ ఎమ్మెల్యేలు, ఓ పారిశ్రామికవేత్తను పోలీసులు విచారించనున్నట్లు తెలుస్తోంది. ఈ కేసు నమోదైన తర్వాత.. ఎఫ్ఎస్ఎల్ నివేదిక రావడంతో.. అధికారులు తిరుపతన్న కాల్‌డేటా ఆధారంగా ముందుకు సాగుతున్నారు. ఈ కేసులో కీలక పాత్ర పోషించిన ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు.. ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేసి.. ఆ తర్వాతే భారత్‌కు వచ్చే యోచనలో ఉన్నట్లు పోలీసువర్గాలు చెబుతున్నాయి. ఫోన్ ట్యాపింగ్‌కు ఇజ్రాయెల్ నుంచి ప్రత్యేక పరికరం (షార్ట్ రేంజ్ బగ్) తెప్పించిన రవిపాల్‌ను మరోసారి విచారించేందుకు దర్యాప్తు అధికారులు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

## అవును.. నేను గులామ్‌నే..

- కేసీఆర్ బాటలోనే అప్పులు చేస్తున్న రేవంత్
- సీఎం రేవంత్‌కు కిషన్‌రెడ్డి కౌంటర్



**హైదరాబాద్, నవంబర్ 18 :** మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో భాగంగా తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి గుజరాతీలకు గులామ్‌లా మారాడంటూ సీఎం రేవంత్‌రెడ్డి కామెంట్ చేశారు. తాజాగా, ఆయన చేసిన వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. సీఎం రేవంత్ తనను గుజరాత్ గులామ్ అంటూ విమర్శిస్తున్నారని.. తాను భారతీయులకు మాత్రమే గులామ్‌నని కిషన్‌రెడ్డి అన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ , మహాత్మా గాంధీ ప్రధాని నరేంద్ర మోడీ పుట్టిన గుజరాత్‌కు తాను గులామ్‌నేనని అన్నారు. ఇటలీకీ, నకిలీ గాంధీ కుటుంబానికి తాను గులామ్ కాదని కౌంటర్ ఇచ్చారు. అదానీ పేరు చెప్పి (బీజేపీ)ని విమర్శిస్తున్నారని.. రాష్ట్రంలో పెట్టుబడుల కోసం (అదానీ)తో రేవంత్ చర్చలు జరపలేదా అని ప్రశ్నించారు. రాష్ట్ర సమస్యల మీద తాను ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే.. సీఎం స్థాయిలో ఉన్న వ్యక్తి ఇలా వ్యక్తిగత వివమర్శలకు దిగడం సరికాదని కిషన్‌రెడ్డి అన్నారు. కేసీఆర్, రేవంత్‌రెడ్డి రాజకీయాల్లో నైతిక విలవదిలేశారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మండిపడ్డారు. రాష్ట్రాన్ని పూర్తిగా భ్రష్టు పట్టించే ప్రయత్నం చేస్తున్నారని వ్యాఖ్యానిం చారు. కేసీఆర్ రూ.7 లక్షల కోట్లమేర అప్పులు చేస్తే...రేవంత్ రెడ్డి ఏకంగా అప్పుల కోసం ఒక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశారని మండిపడ్డారు. రాష్ట్రంలో భారాస, కాంగ్రెస్ పార్టీలు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు. రైతు భరోసా, రుణమాఫీ లేదు. పింఛన్లు పెంచుతామన్నారు.. ఒక్క రూపాయి పెంచలేదు, కొత్త పింఛన్లు ఇవ్వలేదు. రేవంత్‌రెడ్డి వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారు. హామీలన్నీ ఆయన గాలికొదిలేశారు. పైగా మహారాష్ట్రలో నిర్వహిస్తున్న ప్రచారంలో తెలంగాణ సస్యశ్యామలం అయిందంటూ మాట్లాడుతున్నారు. ఇంతకంటే అబద్దాలు ఉంటాయా? కాంగ్రెస్, భారాస తమ వైఫల్యాలు కప్పిపుచ్చు కునేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఈ నెల 22న దిల్లీలో జరగనున్న పార్టీ సంస్థాగత సమావేశాల్లో మండల, జిల్లా ఎన్నికల తేదీలు వస్తాయి. తెలంగాణలో పనిచేయడానికి గుత్తేదారులు ముందుకు రావడం లేదంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో గ్రహించాలన్నారు..



## కాంగ్రెస్‌లో అంతర్గత స్వేచ్ఛ ఎక్కువే

### జనవరిలో పదవుల పందేరం

### స్థానిక ఎన్నికల్లో సత్తాచాటాలి

### కార్యకర్తలకు పిసిసి చీఫ్ మహేశ్ సూచన

**సంగారెడ్డి, నవంబర్ 18 :** కాంగ్రెస్ పార్టీలో ఉన్న స్వేచ్ఛ ఏ పార్టీలో లేదని పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. సీఎం రేవంత్ ని వ్యతిరేకించిన అది పార్టీ కోసమే కానీ వ్యక్తిగతం కాదన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కొంత నారాజ్ ఉన్నారని.. తాము మీకు అండగా ఉంటామని భరోసా కల్పించారు. మన ప్రభుత్వంలో చేస్తున్న అభివృద్ధి పనులను ప్రతి ఒక్క కార్యకర్త ప్రజలకు వివరించాలని సూచించారు. సంగారెడ్డిలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తలు సమావేశం సందర్భంగా పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. జనవరిలో కొంతమంది పార్టీ నాయకులకు పదవులు ఇస్తామని చెప్పుకొచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మన సత్తా చాటాలని అన్నారు. అధికారంలోకి వచ్చి 11 నెలల్లోనే ప్రతిపక్షాలు కుట్రలు చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మకై కాంగ్రెస్ పార్టీపై కుట్ర పన్నుతున్నా యన్నారు. కార్యకర్త కూడా సీఎంను కలిసే వెసులుబాటు కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉందని వ్యాఖ్యానించారు. కార్యకర్తలు నారాజ్ అయితే తాము కుర్చీ దిగాల్సిందేనన్నారు. మరోసారి మనం అధికారంలోకి రావాలి.. ఢిల్లీలో రాహుల్ గాంధీ ప్రధాని కావాలి అని కామెంట్స్ చేశారు. కేసీఆర్ రాష్ట్రాన్ని ఆగం చేస్తే కాంగ్రెస్ పార్టీ రిపేర్లు చేస్తుందన్నారు. బంగారు తెలంగాణ అంటే కేసీఆర్ కుటుంబం మాత్రమే బంగారుమయం అయ్యిందని సెటైర్లు వేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో బీటలు బారుతున్నాయని.. కాంగ్రెస్ పార్టీ కట్టిన ప్రాజెక్టు 70 ఏళ్లయిన చెక్కు చెదరలేదని అన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావుకి పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సవాల్ విసిరారు. మీరు పదేళ్లలో ఎంత అభివృద్ధి చేశారో చెప్పండి..మేము 11 నెలల్లో ఎంత అభివృద్ధి చేశామో చూపిస్తామని ఛాలెంజ్ చేశారు. వచ్చే ఎన్నికల నాటికి తెలంగాణలో బీఆర్ఎస్ ఉండదని సంచలన వ్యాఖ్యలు చేశారు. హరీష్ రావు కూడా పక్క చూపులు చూస్తున్నాడని.. చివరికి పార్టీలో తండ్రి, కొడుకు, కూతురు తప్ప ఎవరూ మిగలరని ఎద్దేవా చేశారు.

## సోషల్ మీడియాలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు

### బీఆర్ఎస్ సోషల్ మీడియా ఇన్‌ఛార్జ్ అరెస్ట్


### పోలీసులు తీరును ఖండించిన హరీష్ రావు



**హైదరాబాద్, నవంబర్ 18 :** సోషల్ మీడియాలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారనే ఆరోపణల నేపథ్యంలో బీఆర్ఎస్ సోషల్ మీడియా ఇన్‌ఛార్జ్ కొణతం దిలీప్‌ను సోమవారం సైబర్ క్రైమ్ పోలీసులు హైదరాబాద్‌లో అరెస్ట్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో డిజిటల్ మీడియా హెడ్‌గా కొణతం దిలీప్ వ్యవహరించారు. అయితే గత ఏడాది చివరలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటరు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టాడు. దీంతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం కొలువు తీరింది. ఈ నేపథ్యంలో కొణతం దిలీప్.. ఆ పదవి నుంచి తప్పుకున్నారు. నాటి నుంచి రేవంత్ సర్కారే లక్ష్యంగా ఆయన సోషల్ మీడియాలో విమర్శలు గుప్పిస్తున్నారు. మూసీ పరివాహక ప్రాంతంలో హైడ్రా రంగంలోకి దిగడంతోపాటు లగచర్ల ఘటనలపై దీనిని ప్రభుత్వం చాలా సీరియస్‌గా తీసుకుంది. ఆ క్రమంలో చర్యలు చేపట్టింది. ఇలాంటి పోస్టులు పెట్టిన.. పెడుతున్న వారిపై చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సమాయత్తమైంది. ఈ నేపథ్యంలో కొణతం దిలీప్‌ను అరెస్ట్ చేసినట్లు సమాచారం. మరోవైపు బీఆర్ఎస్ పార్టీలో కొణతం దిలీప్ సోషల్ మీడియా హెడ్‌గా వ్యవహరిస్తున్నారని తెలుస్తుంది. మరోవైపు కొణతం దిలీప్ అరెస్ట్‌పై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు స్పందించారు. కొణతం దిలీప్ అరెస్ట్‌ను ఆయన ఖండించారు. కక్షపూరిత, ప్రతీకార చర్యలు మానుకోవాలంటూ కాంగ్రెస్ ప్రభుత్వానికి ఆయన హితవు పలికారు. ప్రజా ప్రభుత్వం అని ప్రచారం చేసుకుంటూ.. అప్రజాస్వామికంగా వ్యవహరించడం దుర్మార్గమని ఆయన పేర్కొన్నారు. ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు పెట్టి వేధించడం సిగ్గు చేటన్నారు. తెలంగాణ ఉద్యమకారుడు కొణతం దిలీప్ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. ఆయనను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా హరీశ్ రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా హరీశ్ రావు స్పందించారు.

## కడియంను పర్వతగిరికి పంపించే వరకు నిద్రపోను

### బీఆర్ఎస్ నేత తాటికొండ రాజయ్య




**స్టేషన్ ఘన్‌పూర్, నవంబర్ 18 :** నియోజకవర్గంలో నువ్వైనా ఉండాలి.. నేనైనా ఉండాలని కాంగ్రెస్ నేత కడియం శ్రీహరి చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ నేత తాటికొండ రాజయ్య స్పందించారు. కడియం సవాలును స్వీకరిస్తున్నానని చెబుతూ ఒక వీడియోను రిలీజ్ చేశారు. కడియం శ్రీహరి స్థానికేతరుడు అని.. ఆయన్ను పర్వతగిరి పంపించే వరకు నిద్రపోనని స్పష్టం చేశారు. నియోజకవర్గంలో నువ్వో నేనో మిగలాలని కడియం శ్రీహరి అంటున్నాడని.. ఆయన ఎక్కడ కూడా తనకు పోటీ రాలేదని రాజయ్య అన్నారు. తాను వంసగా నాలుగుసార్లు గెలిచానని గుర్తుచేశారు. కడియం శ్రీహరి ప్రజా నాయకుడు కాదని.. రాజకీయ నాయకుడు మాత్రమేనని విమర్శించారు. కడియం స్థానికేతరుడు అని.. ఆయన్ను తప్పకుండా తరిమికొడతానని అన్నారు. కడియం శ్రీహరి విసిరిన సవాలును స్వీకరిస్తున్నా అని తాటికొండ రాజయ్య అన్నారు. ' నేను ఇక్కడే పుట్టా.. ఇక్కడే పెరిగా.. ఇక్కడే ఉంటా.. రేపు ఛస్తే ఇక్కడే నన్ను బొంద పెడతారు. ' అని చెప్పారు. కానీ నిన్ను స్థానికేతరుడిలాగే గుర్తిస్తారని కడియం శ్రీహరిని ఉద్దేశించి రాజయ్య పేర్కొన్నారు. ఆయన్ను పర్వతగిరికి పంపించే వరకు నిద్రపోనని స్పష్టం చేశారు. సత్యహరిశ్చంద్రుడిలా నీతిమంతుడినని కడియం శ్రీహరి డబ్బా కొట్టుకోవడం సిగ్గు చేటు అని రాజయ్య విమర్శించారు. ఆయన అనేక అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. అవినీతి తిమింగలంలా అయ్యాడని అన్నారు. ఎంపీ ఎన్నికల్లో కడియం శ్రీహరి రూ.100 కోట్లు ఖర్చు చేశారని తెలిపిన ఆయన.. ఆ 100 కోట్లు ఎక్కడివని ప్రశ్నించారు.

## హామీల అమలులో రేవంత్‌రెడ్డి డకౌట్ : హరీశ్‌రావు

**హైదరాబాద్, నవంబర్ 18 :** కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో రేవంత్ రెడ్డి డకౌట్ అయ్యారని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. పేదోళ్ల ఇండ్లు కూలగొట్టడమే రేవంత్ హిట్ వికెట్ అని పేర్కొన్నారు. తుర్కయాంజల్ జేబీ గ్రౌండ్స్‌లో నిర్వహించిన తెలంగాణ ఛాంపియన్ ట్రోఫీ క్రికెట్ టోర్నమెంట్‌లో హరీశ్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. గెలిచిన టీం కాదు, ఓడిపోయిన టీం కూడా బాగా ఆడారు. గెలుపోటములు చాలా సహజం. భవిష్యత్తులో గెలుపు కోసం పోరాటం చేయాలి. ఆరు గ్యారెంటీలు బంద్ పెట్టి మూసీ దుకాణం మొదలు పెట్టిండు రేవంత్ రెడ్డి. 31 ఎస్టీపీలు, రూ. 3800 కోట్లతో మూసీ అభివృద్ధిని కేసీఆర్ ప్రారంభించాడు. కాళేశ్వరం ద్వారా గోదావరి నీళ్లను రూ. 1100 కోట్లతో మూసీలో పోయాలని ప్లాన్ చేశారు. మూసీ శుద్ధి చేయాలంటే గోదావరి నీళ్లు తేవాలి. అంతేగాని గరీబోళ్ల ఇల్లు కూలగొట్టడం కాదు. మూసీ పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తా అంటే బీఆర్ఎస్ ఊరుకోదు అని హరీశ్‌రావు హెచ్చరించారు. ఆరు గ్యారెంటీలు అన్నడు మోసం చేసిండు. పింఛన్లు, విద్య భరోసా కార్డు, ఉద్యోగాలు ఏవీ లేవు. ఇప్పటి వరకు ఒక్క విద్యార్థికి కూడా స్కాలర్‌షిప్స్ డబ్బులు ఇవ్వలేదు. డిగ్రీ పాస్ అయిన విద్యార్థులకు యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు. పదేళ్ల కేసీఆర్ పాలనలో ప్రతి సంవత్సరం రూ. 20 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇచ్చారు. ఏడాది అవుతున్నది ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు రేవంత్ అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు.

## ఆమ్ ఆద్మీ పార్టీకి షాక్

**న్యూఢిల్లీ, నవంబర్ 18 :** అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఢిల్లీలో అధికార ఆమ్ ఆద్మీ పార్టీకి గట్టి షాక్ తగిలింది. ఆ పార్టీ కీలక నేతగా వ్యవహరించిన అశోక్ గెహ్లాట్ నిన్న ఆప్‌కు రాజీనామా చేసిన విషయం తెలిసిందే. తాజాగా ఆయన బీజేపీలో చేరారు. ఢిల్లీలోని ఆప్ ప్రభుత్వంలో కైలాశ్ గెహ్లాట్ రవాణా శాఖ మంత్రిగా పనిచేసిన విషయం తెలిసిందే. అయితే, ఆదివారం ఆయన పార్టీకి రాజీనామా చేశారు. ఆయన రాజీనామాను ముఖ్యమంత్రి ఆతిశీ ఆమోదించారని పార్టీ వర్గాలు తెలిపాయి. ఇక రాజీనామా అనంతరం ఆయన బీజేపీలో చేరుతారంటూ వార్తలు వచ్చాయి. ఆ వార్తలను నిజం చేస్తూ ఇవాళ కమలం పార్టీలో చేరారు. కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్, ఢిల్లీ చీఫ్ వీరేంద్ర సచ్‌దేవ్ సమక్షంలో బీజేపీ కండువా కప్పుకున్నారు. కాగా, రాజీనామా సందర్భంగా ఆప్ ప్రభుత్వంపై కైలాశ్ గెహ్లాట్ తీవ్ర ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. ఢిల్లీ ప్రభుత్వం అసంపూర్తి హామీలు ఇస్తోందన్నారు. ప్రజల హక్కుల కోసం పోరాటం చేయాల్సిన పార్టీ సొంత రాజకీయ అజెండా కోసం పాకులాడుతున్నదని ఆరోపించారు. తాజా పరిణామంతో వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరిగే అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆప్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలినట్లైంది.



ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
మంగళవారం
19 నవంబర్
2024



# నేడు వరంగల్‌లో విజయోత్సవ సభ

**వరంగల్, నవంబర్18 :** వరంగల్‌లో రాష్ట్ర ప్రభుత్వ ఏడాది పాలన విజయోత్సవ సభకు భారీఏర్పాట్లు చేశారు. సిఎం రేవంత్ రెడ్డి పాల్గొనే సభకు సంబంధించి మంత్రులు సీతక్క, కొండా సురేఖ, శ్రీధర్ బాబులు దగ్గరుండి పనులు పర్యవేక్షించారు. ఈ సభ కాంగ్రెస్ పాలనలో ఓ మైలురాయి అన్నారు. మహిళాశక్తి సదస్సుతో సత్తాచాటుతామని అన్నారు. మహిళలను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషిచేస్తున్నామని మంత్రులు అన్నారు. ఇకపోతే ఓరుగల్లుకు మహర్దశ వచ్చింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వరంగల్ నగర పర్యటనకు ముందే నిధుల వరద పారింది. మామునూరు విమానాశ్రయం పునరుద్ధరణ, భూసేకరణ, విజన్-2041 వరంగల్ నూతన మాస్టర్ ఎ÷-లాన్‌ను ఆమోదిస్తూ ఆదివారం సాయంత్రం జీవో జారీ చేశారు. గత మూడేళ్లుగా నిధులు లేక పెండింగ్‌లో ఉన్న వరంగల్ మహా నగరపాలక సంస్థ పరిపాలన భవన నిర్మాణానికి రూ.32.50 కోట్లు కేటాయించారు. ఐదు అంతస్తులు, ఆధునిక హంగులతో భవన నిర్మాణం చేపడతారు.



ఈనెల 19న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వరంగల్ నగర పర్యటనపై గ్రేటర్ వరంగల్, కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ అప్రమత్తమైంది. హనుమకొండ బాలసముద్రం లో కాళోజీ కళాక్షేత్రం, హనుమకొండ జిల్లా సమీకృత కలెక్టరేటు, ఆర్ట్స్ అండ్ సైన్సు కళాశాల సభాస్థలి, కాజీపేట నుంచి హనుమకొండ వరకు ప్రధాన రహదారులకు మరమ్మతులు, పారిశుద్ధ్య పనులు, దోమల నివారణకు ఫాగింగ్ తదితర పనుల పురోగతిని కమిషనర్ అశ్విని తానాజీ వాకడే పరిశీలించారు. సీఎం పర్యటన ముగిసే వరకు అన్ని విభాగాల వింగ్ అధికారులు, క్షేత్రస్థాయి ఉద్యోగులు నగరంలోనే ఉండాలని, సెలవులు లేవని కమిషనర్ ఆదేశించారు. వరంగల్ త్రినగరాల చుట్టూ ప్రతిపాదించిన ఇన్నర్ రింగురోడ్డు పొడిగింపునకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఖమ్మం జాతీయ రహదారి నాయుడు పంపు కూడలి నుంచి ఖిలావరంగల్ కోట, స్తంభంపెల్లి శివారు మీదుగా నర్సంపేటరోడ్ జానిపీరీల నుంచి గొర్రెకుంట క్రాస్‌రోడ్, కీర్తినగర్ నుంచి ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ వరకు 8 కి.మీ. ఇన్నర్ రింగురోడ్డును పొడిగించారు. 200 అడుగుల రహదారి పనుల అంచనా వ్యయాన్ని రూ.50 కోట్ల నుంచి రూ.80 కోట్లకు పెంచారు. గతంలో సీఎం హామీల పథకం ద్వారా రూ.50 కోట్లు కేటాయించారు. ప్రస్తుత ప్రభుత్వం రూ.30 కోట్లు కేటాయించింది.



# దళిత రైతుల ఇళ్లపై దౌర్జన్యకాండ

**సీఎం బ్రదర్ గిరిజన రైతులపై దాడి చేసినా కేసులుండవా?**

**లగచర్లలో అర్ధరాత్రి మహిళలపై పోలీసుల దాడి చేశారు**

**గిరిజన రైతులను అరెస్టు చేసి చిత్రహింసలు పెట్టారు**

**తెలంగాణలో ఏం జరుగుతుందో దేశానికి తెలియాలి**

**భూములను ప్రభుత్వం బలవంతంగా గుంజుకుంటోంది**

**లగచర్ల ఘటన చిన్నదేమీ కాదు..**

**ఈ ఘటనపై ప్రధాని, రాహుల్ గాంధీ స్పందించాలి**

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్**

**న్యూఢిల్లీ, నవంబర్ 18 :** మణిపూర్, లక్షద్వీప్ కంటే లగచర్ల ఘటన చిన్నదేమీ కాదని.. ఈ ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ స్పందించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు డిమాండ్ చేశారు. లగచర్ల బాధితులతో కలిసి ఆయన జాతీయ మానవహక్కుల సంఘాన్ని కలిశారు. అనంతరం బాధితులతో కలిసి ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. తెలంగాణలో ఏం జరుగుతుందో దేశానికి తెలియాలని.. పేద గిరిజనుల భూములను రేవంత్ సర్కార్ బలవంతంగా గుంజుకుంటోందని కేటీఆర్ ఆరోపించారు. అర్ధరాత్రి పోలీసులు, ప్రైవేటు వ్యక్తులతో కలిసి దళిత రైతుల ఇళ్లపై దౌర్జన్యకాండ జరుగుతుందని.. సీఎం బ్రదర్ గిరిజన రైతులపై దాడి చేసినా కేసులుండవని విమర్శించారు. ప్రజాప్రతినిధి కాకున్నా సీఎం సోదరుడికి కలెక్టర్ స్వాగతం పలుకుతున్నారన్నారు. రాజ్యాంగ రక్షకులమంటున్న రాహుల్ సీఎం నియోజకవర్గంలో దమనకాండ స్పందించాలన్నారు. లగచర్లలో అర్ధరాత్రి మహిళలపై పోలీసుల దాడి చేశారని.. గిరిజన రైతులపై అక్రమంగా అరెస్టు చేసి చిత్రహింసలు పెట్టారన్నారు.లగచర్ల ఘటనపై ప్రధాని మోదీ, రాహుల్, ఖర్గే ఎందుకు స్పందించరు? అంటూ ప్రశ్నించారు. మణిపూర్, లక్షద్వీప్ కంటే లగచర్ల ఘటన చిన్నదేమీ కాదని.. సీఎం సోదరుడి కంపెనీ కోసమే ఇంతమంది గిరిజనులు బాధపెడుతున్నరని ఆరోపించారు. తెలంగాణలో ఏం జరుగుతుందో తెలియనట్లు బీజేపీ నాటకాలు ఆడుతుందని.. సీఎం నియోజకవర్గంలో జరుగుతున్న దమనకాండపై స్పందించాలని డిమాండ్ చేశారు. పేద గిరిజనుల బాధ రాహుల్‌గాంధీకి కనిపిస్తలేదా?.. లగచర్లపై అర్ధరాత్రి దమనకొండ బీజేపీకి కనబడడం లేదా? అంటూ నిలదీశారు. కొడంగల్‌లో 3వేల ఎకరాల్లో ఫార్మా విలేజీ కోసం సీఎం నిర్ణయించారని.. రైతులకు నోటీసులు ఇచ్చి.. వాటిని తిరస్కరించిన వారిని బెదిరిస్తున్నారన్నారు. మహారాష్ట్ర ఎన్నికల ప్రచారం గడువు ముగిసింది.. రాహుల్ ఇప్పటికైనా స్పందించాలని.. రైతులతో చర్చలు జరిపేందుకు ఎవరూ ముందుకురావడం లేదన్నారు. ఫార్మా సిటీ కోసం మా హయాంలో 14వేల ఎకరాల భూమిని సేకరిస్తున్నారని.. తమ హయాంలో ఆ రైతులందరినీ ఒప్పించి భూములను సేకరించామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాలను ఎత్తి చూపితే అక్రమ అరెస్టులు చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలతో తెలంగాణ ప్రజలను మోసం చేసిందని.. మా బీఆర్ఎస్ నేతలందరూ జాతీయ మానవహక్కుల, మహిళా హక్కుల కమిషన్‌ను కలిశారన్నారు. ఎస్టీ హక్కుల కమిషన్ సైతం కలిసి లగచర్ల దమనకాండ వివరించారన్నారు. సీఎం నియోజకవర్గంలో తొమ్మిది నెలలుగా గొడవలు జరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. ఎకరానికి రూ.60-రూ.70లక్షల విలువైన భూమికి రూ.10లక్షలు ఇస్తామంటున్నారని.. లగచర్ల అర్ధరాత్రి మహిళలనీ చూడకుండా దాడులు చేశారన్నారన్నారు. గిరిజన రైతులను అరెస్టు చేసి చిత్రహింసలు పెట్టారని.. మణిపూర్ గురించి మాట్లాడే రాహుల్ గాంధీ కొడంగల్ దమనకాండపై ఎందుకు మాట్లాడరు ? మండిపడ్డారు. రాహుల్ గాంధీ, ప్రధాని నరేంద్ర మోదీ సైతం స్పందించాలని డిమాండ్ చేశారు. రాజ్యసభలో ఈ విషయం లేవనెత్తుతాం.. పార్లమెంట్‌లోనూ ఈ విషయం మాట్లాడాలని కోరుతామన్నారు. లగచర్ల బాధితుల తరఫున ఢిల్లీకి బీఆర్ఎస్ శ్రేణులందరికీ ధన్యవాదులు చెబుతున్నానన్నారు. న్యాల్‌కల్‌తో పాటు పలుచోట్ల భూముల విషయంలో ప్రజలు నిరసనలు తెలుపుతున్నారని.. కందుకూరు, యాచారంలో పర్యటించి రైతుల్లో కాంగ్రెస్ నేతల్లో విషం నింపారన్నారు. అదే 14వేల ఎకరాల్లో ఫోర్త్‌సిటీ, ఫార్మా విలేజీలను ఏర్పాటు చేస్తున్నారని, భూములు ఇవ్వకపోతే తొక్కుతామని సీఎం సోదరుడు అంటున్నాడని మండిపడ్డారు. కొడంగల్ నియోజకవర్గంలో ఇంత ఆందోళన జరిగితే రేవంత్ మహారాష్ట్రలో ప్రచారం చేస్తారా? అంటూ ధ్వజమెత్తారు. ఢిల్లీకి మూటలు పంపుతున్నందుకు రేవంత్ ఐదేళ్లు ముఖ్యమంత్రిగా ఉంటారని.. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అస్థిరపరిచే ఉద్దేశం మాకు లేదన్నారు.

## దూరదృష్టితో సర్వే చేపట్టాం: పొంగులేటి



**హైదరాబాద్, నవంబర్ 18 :** ఎంతో దూరదృష్టితో కాంగ్రెస్ ప్రభుత్వం సర్వేను చేపట్టిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. అయితే, గత ప్రభుత్వం సమగ్ర సర్వే నివేదికను ఎందుకు బయటపెట్టలేదని ప్రశ్నించారు. గత ప్రభుత్వం చేసిన తప్పులను కాంగ్రెస్ ప్రభుత్వం సరిదిద్దుతోందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు. మంచి ప్రతిపక్షంగా విలువైన సూచనలు ఇస్తే.. స్వీకరిస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏ పనిని కూడా కక్షపూరితంగా చేయడం లేదని స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలోని నేతలు చేసిన అక్రమాలపై చట్టపరంగానే చర్యలుంటాయని మంత్రి పొంగులేటి తెలిపారు.

# సోషల్ మీడియాలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు

**బీఆర్ఎస్ సోషల్ మీడియా ఇన్‌ఛార్జ్ కొణతం అరెస్ట్**

**ప్రశ్నిస్తే సంకెళ్లు..! నిలదీస్తే అరెస్టులు..!!**

**కొణతం దిలీప్ అరెస్టుపై మండిపడ్డ కేటీఆర్**

**కొణతం దిలీప్ అరెస్ట్ ను ఖండించిన హరీశ్‌రావు**


**హైదరాబాద్, నవంబర్ 18 :** సోషల్ మీడియాలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారనే ఆరోపణల నేపథ్యంలో బీఆర్ఎస్ సోషల్ మీడియా ఇన్‌ఛార్జ్ కొణతం దిలీప్‌ను సోమవారం సైబర్ క్రైమ్ పోలీసులు హైదరాబాద్‌లో అరెస్ట్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో డిజిటల్ మీడియా హెడ్‌గా కొణతం దిలీప్ వ్యవహరించారు. అయితే గత ఏడాది చివరలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటరు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టాడు. దీంతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం కొలువు తీరింది. ఈ నేపథ్యంలో కొణతం దిలీప్.. ఆ పదవి నుంచి తప్పుకున్నారు. నాటి నుంచి రేవంత్ సర్కారే లక్ష్యంగా ఆయన సోషల్ మీడియాలో విమర్శలు గుప్పిస్తున్నారు. మూసీ పరివాహక ప్రాంతంలో హైడ్రా రంగంలోకి దిగడంతోపాటు లగచర్ల ఘటనలపై దీనిని ప్రభుత్వం చాలా సీరియస్‌గా తీసుకుంది. ఆ క్రమంలో చర్యలు చేపట్టింది. ఇలాంటి పోస్టులు పెట్టిన.. పెడుతున్న వారిపై చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సమాయత్తమైంది. ఈ నేపథ్యంలో కొణతం దిలీప్‌ను అరెస్ట్ చేసినట్లు సమాచారం. మరోవైపు బీఆర్ఎస్ పార్టీలో కొణతం దిలీప్ సోషల్ మీడియా హెడ్‌గా వ్యవహరిస్తున్నారని తెలుస్తుంది. మరోవైపు కొణతం దిలీప్ అరెస్ట్‌పై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు స్పందించారు. కొణతం దిలీప్ అరెస్ట్‌ను ఆయన ఖండించారు. కక్షపూరిత, ప్రతీకార చర్యలు మానుకోవాలంటూ కాంగ్రెస్ ప్రభుత్వానికి ఆయన హితవు పలికారు. ప్రజా ప్రభుత్వం అని ప్రచారం చేసుకుంటూ.. అప్రజాస్వామికంగా వ్యవహరించడం దుర్మార్గమని ఆయన పేర్కొన్నారు. ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు పెట్టి వేధించడం సిగ్గు చేటన్నారు. తెలంగాణ ఉద్యమకారుడు కొణతం దిలీప్ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. ఆయనను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా హరీశ్ రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా హరీశ్ రావు స్పందించారు. తెలంగాణ డిజిటల్ మీడియా మాజీ డైరెక్టర్ కొణతం దిలీప్‌ను పోలీసులు మళ్లీ అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. దిలీప్ అరెస్టును బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ ప్రభుత్వ చర్యలపై కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రశ్నిస్తే సంకెళ్లు వేయడం.. నిలదీస్తే అరెస్టు చేయడం సరికాదన్నారు కేటీఆర్.నియంత రాజ్యమది.. నిజాం రాజ్యాంగమిది.. అని రేవంత్ రెడ్డి సర్కార్‌ను దుయ్యబట్టారు. కాంగ్రెస్ వైఫల్యాలను ఎత్తిచూపినందుకే కొణతం దిలీప్ అరెస్ట్.. విచారణకు రమ్మని పిలిచి అక్రమంగా అరెస్ట్ చేస్తారా? అని ప్రభుత్వాన్ని కేటీఆర్ ప్రశ్నించారు.ఎన్నాళ్లు ఈ అక్రమ అరెస్టులతో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తావ్! ప్రజాస్వామ్య ప్రేమికులం.. ప్రజాస్వామ్యబద్ధంగానే ఎదుర్కొంటాం! అని తేల్చిచెప్పారు కేటీఆర్. నీ అక్రమ అరెస్టులకో.. నీ ఉడత బెదిరింపులకో.. భయపడం..! నీ అక్రమ అరెస్టులకు భయపడేవాడు ఎవరూ లేరిక్కడ అని కేటీఆర్ స్పష్టం చేశారు. చివరగా జై తెలంగాణ అని పేర్కొంటూ కేటీఆర్ తన ట్వీట్‌ను ముగించారు. తెలంగాణ మాజీ డిజిటల్ డైరెక్టర్ కొణతం దిలీప్‌ను పోలీసులు మళ్లీ అరెస్టు చేశారు. కోర్టు ఆదేశాల మేరకు విచారణ నిమిత్తం సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌కు వచ్చిన దిలీప్ కొణతంను అరెస్ట్ చేసిన పోలీసులు తెలిపారు.

## లగచర్ల ఘటనతో ప్రభుత్వం అప్రమత్తం

**డిఎస్పీ కరుణాసాగర్‌పై బదిలీ వేటు**

**హైదరాబాద్, నవంబర్ 18 :** లగచర్ల కలెక్టర్ పై దాడి ఘటనలో పరిగి డీఎస్పీ కరుణాసాగర్ రెడ్డి పై బదిలీ వేటు పడింది. పరిగి కొత్త డిఎస్పీగా ఎన్.శ్రీనివాస్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఘటనకు సంబంధించి మరి కొంతమంది అధికారులపై వేటుపడే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ మేరకు డీఎస్పీ కరుణసాగర్ రెడ్డిని డీజీపీ ఆఫీస్‌కి అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది ప్రభుత్వం.కాగా.. లాగచర్ల దాడి ఘటన అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య చిచ్చు రేపింది. ఈ ఘటనలో మాజీ మంత్రి కేటీఆర్ ప్రమేయం ఉందంటూ కామెంట్ చేస్తున్నారు కాంగ్రెస్ నాయకులు. కొడంగల్?లో గిరిజనులు, లంబాడాలకు మేలు జరగకూడదని బీఆర్ఎస్ నేతలు కుట్రపన్నుతున్నారని ఆరోపిస్తున్నారు కాంగ్రెస్ నేతలు. కేటీఆర్‌స్వయంగా బీఆర్ఎస్ నేతలకు భరోసా ఇవ్వడం వల్లే కలెక్టర్‌పై దాడి జరిగిందని ఆరోపిస్తున్నారు కాంగ్రెస్ నేతలు. ఖమ్మంలో లంబాడాలైన మిర్చి రైతులకు సంకెళ్లు వేసి జైలుకు పంపిన చరిత్ర బీఆర్ఎస్‌దని.. టెర్రరిస్టుల కన్నా దారుణంగా లంబాడాలపై గత ప్రభుత్వం దమనకాండ సాగించిందని ఫైర్ అవుతున్నారు కాంగ్రెస్ నేతలు.

## ఎసిబి వలలో పంచాయితీరాజ్ ఎఇ



**గద్వాల,నవంబర్18 :** జోగులాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండల పంచాయతీ రాజ్ ఏఈ పాండురంగారావు రూ.50 వేల లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కారు. ఎర్రవల్లి మండలం రాజశ్రీ గార్లపాడు గ్రామంలో మైనారిటీ షాదిఖానా భవన నిర్మాణ పనులకు బిల్లులు చేయడానికి ఏఈ.. ఓ వ్యక్తి రూ.50 వేలు డిమాండ్ చేయగా ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. పంచాయతీరాజ్ ఆఫీస్‌లో బాధితుడిని నుంచి ఏఈ లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.



# దేవాలయం సమీపంలో పేలుడు

**పూజారికి తీవ్రగాయాలు**

**హైదరాబాద్, నవంబర్ 18 :** శివారులోని ఓ దేవాలయం సమీపంలో సోమవారం నాడు భారీ పేలుడు చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఆలయ పూజారి గాయపడ్డారు. సైబరాబాద్ కమిషనరేట్ పరిధి మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని లక్ష్మిగూడ రోడ్డులో గల ప్రజాపతి శ్రీశ్రీశ్రీ యాదే మాత ఆలయం సమీపంలో ఈ పేలుడు జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం? పూజారి ఆలయం వెలుపల పేవ్‌మెంట్‌పై చెట్లను తొలగిస్తున్న సమయంలో ఈ పేలుడు చోటు చేసుకుంది. పూజారి సుగుమరాంను అంబులెన్స్ లో ఆసుపత్రికి తరలించారు. ఇది మార్వాడి సమాజ్‌కు చెందిన దేవాలయం. ఉదయం పదిన్నర గంటల సమయంలో పేలుడు సంభవించింది. దీంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు.విషయం తెలియగానే పోలీసులు ఘటనాస్థలికి చేరుకున్నారు. ఆ ప్రాంతాన్ని బాంబ్ స్క్వాడ్ క్షుణ్ణంగా తనిఖీ చేసింది. పేలుడుకు గల కారణాలపై ఫోరెన్సిక్ బృందం విచారణ చేపట్టింది. ఆధారాలు సేకరించేందుకు పోలీసుల బృందాన్ని రంగంలోకి దించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి ఒకరు వెల్లడించారు. రాజేంద్రనగర్ ఏసిపి టి.శ్రీనివాస్, స్థానిక కార్పోరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి సంఘటన స్థలాన్ని సందర్శించారు.

## ఈటల, డీకే అరుణ, ఏలేటి అరెస్ట్

**లగచర్లకు వెళ్తుండగా అదుపులోకి తీసుకున్న పోలీసులు**

**వికారాబాద్,నవంబర్18 :** కొడంగల్ నియోజకవర్గంలోని లగచర్ల, సమీప తండాల వాసులకు భరోసా కల్పించేందుకు వెళ్తున్న బీజేపీ ఎంపీలు ఈటల రాజేందర్, డీకే అరుణ, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేశారు. లగచర్లలో ఫార్మా పరిశ్రమ ఏర్పాటుకు వ్యతిరేకంగా అక్కడి ప్రజలు ఉద్యమిస్తున్నారు. ఈక్రమంలో పలువురిపై కేసులు పెట్టి అరెస్ట్ చేశారు. ఇండ్లల్లో ఉన్న మహిళలపై పోలీసులు అర్ధరాత్రి కరెంట్ తీసి వేధింపులకు పాల్పడుతున్నారు. వారికి భరోసా ఇచ్చేందుకు బీజేపీ నేతలు వెళ్తుండగా మొయినాబాద్ వద్ద పోలీసులు వారి వాహనాలను అడ్డుకున్నారు. ఎంపీలు ఈటల రాజేందర్, డీకే అరుణ, ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డిని అదుపులోకి తీసుకొని నార్సింగి పోలీస్ స్టేషన్ కు తరలించారు.



ప్రతి అక్షరం - ప్రజల కోసం

రోమింగ్ న్యూస్

తెలుగు దినపత్రిక

మంగళవారం

19 నవంబర్

2024






# డీఎస్సీ నిరుద్యోగులకు మరింత ఎదురుచూపు

**డిఎస్సీ నిరుద్యోగులకు మరింత ఎదురుచూపు**

**వర్గీకరణ తీర్పు అమలు చేసే పనిలో ప్రభుత్వం**

**వర్గీకరణ తేలాకే నోటిఫికేషన్ ఇచ్చే ఛాన్స్**




విజయవాడ,నవంబర్ 18 : ఆంధ్రప్రదేశ్‌లో డీఎస్సీ కోసం ఎదురు చూస్తున్న అభ్యర్థులకు మరింత ఎదురుచూపు తప్పేలా లేదు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు అనుగుణంగా ముందుకు వెళ్లాల్సి ఉండడంతో తో డీఎస్సీ ఆలస్యం అయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ నోటిఫికేషన్ నుంచే వర్గీకరణ తీర్పు అమలు చేయాలని వచ్చిన విజ్ఞప్తితో దీనిపై ప్రభుత్వం అధ్యయనం చేస్తోంది. ఎలాంటి న్యాయపరమైన చిక్కులు రాకుండా నోటిఫికేషన్ వేసి ఎలాంటి అడ్డంకులు లేకుండా ఉద్యోగాలు భర్తీ చేయాలని చూస్తోంది. అందుకే ఆలస్యమవుతుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పదవీ బాధ్యతలు చేపట్టిన తొలి రోజే ముఖ్యమంత్రి చంద్రబాబు డీఎస్సీ జిఓ ఫైల్‌పై సంతకం చేశారు. అయితే ముందుగా టెట్ నిర్వహించాలని చాలా మంది అభ్యర్థుల విజ్ఞప్తి మేరకు డీఎస్సీ నోటిఫికేషన్ ఆలస్యం చేసి ముందుగా టెట్ నిర్వహించారు. ఈ మధ్య ఆ పరీక్ష ఫలితాలను కూడా విడుదల చేశారు. ఇప్పుడు నోటిఫికేషన్ వేసే సమయంలో ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలన్న డిమాండ్‌లు తెరపైకి వచ్చాయి. లేకుంటే వచ్చే డీఎస్సీ నాటికి తామంతా నష్టపోతామంటూ చాలామంది ఎస్సీ నాయకులు ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీ వర్గీకరణ అమలుకు ఓ ప్రత్యేక కమిషన్‌ను వేసింది. సుప్రీంకోర్టు తీర్పును పూర్తిగా స్టడీ చేసి రిపోర్ట్ ఇవ్వాలని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రాను నియమించింది. రెండు నెలల్లో నివేదిక ఇవ్వాలని రెండు రోజుల క్రితమే ఉత్తర్వులు జారీ చేసింది. ఆ నివేదిక వచ్చిన తర్వాతే నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే నాటికి డీఎస్సీ నియామకాలు పూర్తి చేసి కొత్త ఉపాధ్యాయులతో స్కూల్స్ ప్రారంభిం చాలని ప్రభుత్వం భావిస్తోంది. కాస్త ఆలస్యమైనా సరే అనుకున్నట్టుగానే పక్రియ పూర్తి అవుతుందని ప్రభుత్వం చెబుతోంది. ఒకట్రెండు రోజుల్లో దీనిపై క్లారిటీ ఇవ్వాలని నిర్ణయించింది. విలైతే సభలో ప్రకటించే అవకాశం లేకపోలేదు. ఈ మధ్య కాలంలో పదే పదే డీఎస్సీ అంశాన్ని ప్రతిపక్షాలు ప్రస్తావిస్తున్నాయి. వీలు చిక్కినప్పుడల్లా ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాయి. అయితే తాము ఇచ్చిన మాట ప్రకారం నోటిఫికేషన్ వస్తుందని మంత్రి లోకేష్ పదే పదే చెబుతున్నారు. వచ్చే విద్యా సంవత్సరం నాటికి డీఎస్సీ పోస్టులు భర్తీ చేస్తామని అంటున్నారు. ముందు నుంచి అదే చెబుతున్నామని దానికి కట్టుబడి ఉన్నామని వివరిస్తున్నారు. అయితే ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానం ప్రకారం సిపిఎస్‌ను రద్దు చేయాలని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు డిమాండ్ చేశారు. పెన్షన్ ఇవ్వడం అన్నది హక్కు అన్నారు. దీనిని ఇప్పుడు ఏవేవో కారణాలు చూపి ఆపడం సరికాదన్నారు. గత జగన్ ప్రభుత్వం చెబుతున్న జిపిఎస్‌ను అంగీకరించ బోమని తెలిపారు. సిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్ అమలు చేయాలని ఆయన కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. రాష్ట్ర వ్యాప్తంగా 25 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఐదేళ్ల వైసిపి పాలనలో ఒక్క డిఎస్‌సి కూడా ఇవ్వలేదని, ఇప్పుడు ఖాళీలను గుర్తించి అన్నీ చేయాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వం అవలంబిస్తోన్న ఏకపక్ష ధోరణిని విడనాడాలన్నారు. జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని, పోలీసులు, డిగ్రీ, జూనియర్ కళాశాల అధ్యాపకుల పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు 60 నుండి 62 సంవత్సరాల కాల పరిమితి పెంపును ఎయిడెడ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు, గురుకుల ఉపాధ్యాయులు, గ్రంథాలయ శాఖ ఉద్యోగులు, యూనివర్సిటీ నాన్ టీచింగ్ ఉద్యోగులకూ వర్తింపజేయాలని కోరారు.

# మంగళగిరి రోడ్డుపై అఘోరీ హల్చల్..

**పవన్ కళ్యాణ్ ను కలవాలని రోడ్డుపై బైఠాయింపు**

**అడ్డుకున్న పోలీసులపై దాడిచేసిన అఘోరీ!**




మంగళగిరి,నవంబర్ 18 : మంగళగిరి రహదారిపై లేడీ అఘోరీ హల్చల్ చేసింది. విజయవాడ వెళ్లే రహదారిపై మంగళగిరి వద్ద జనసేన పార్టీ కార్యాలయం దగ్గరలో హైవేపై బైఠాయించింది. తను పవన్ కళ్యాణ్ ను కలవాలని, ఆయనను కలిసిన తర్వాతనే ఇక్కడ నుండి వెళతానంటూ డిమాండ్ చేస్తూ రోడ్డుపై బైఠాయించింది. ఆలయ భూములు పరిరక్షించాలని పవన్ కళ్యాణ్ ను కోరతానని చెప్పింది.పవన్ కళ్యాణ్ రావాలి%ొ% అంటూ నినాదాలు చేసింది. అఘోరీ నిరసనతో గుంటూరు విజయవాడ మార్గంలో కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ఈ క్రమంలో వీడియో తీస్తున్న ఓ రిపోర్టర్ పై కర్రతో దాడి చేసి అతడిని గాయపరిచింది. అదుపులోకి తీసుకోవాలని ప్రయత్నించిన పోలీసుల పైనా దాడికి యత్నించింది. ఈ క్రమంలో అక్కడ ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. అఘోరీ తీరుపై వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపై బైఠాయించడం వల్ల ఎంతో మందికి ఇబ్బంది అవుతోందని మండిపడుతున్నారు. కావాలంటే జనసేన కార్యాలయం ముందు ధర్నా చేసుకోవాలని చెబుతున్నారు. ఇదిలా ఉంటే అఘోరీ ప్రతిరోజు ఏదో ఒక రకంగా వార్తల్లో నిలుస్తోంది. తన కారులో తెలుగు రాష్ట్రాల్లో పర్యటిస్తూ రచ్చ రచ్చ చేస్తోంది. ఇటీవల ఏపీలోని ఓ ఆలయం వద్ద ఆత్మహత్యకు యత్నించింది. ఈ క్రమంలో పోలీసులు అడ్డుకున్నారు. కొద్దిరోజుల క్రితం సికింద్రాబాద్ అమ్మవారి ఆలయంలో ఆత్మార్పణం చేసుంటానని ప్రకటించి సంచలనం రేపింది. దీంతో పోలీసులు అదుపులోకి తీసుకుని మంచిర్యాల జిల్లా నెన్నెలలోని తమ స్వగృహానికి తరలించి నిర్బంధించారు. అనంతరం పోలీసులు మహారాష్ట్ర బార్డర్ దాటించి మళ్లీ కొద్దిరోజుల వరకు తెలంగాణలో కనిపించవద్దని వార్నింగ్ ఇచ్చారు. దీంతో ఏపీలో దర్శనం ఇచ్చింది. ఇప్పుడు అటు ఏపీ ఇటు తెలంగాణలో సంచరిస్తూ ఏదో ఒకరకంగా వార్తల్లో నిలుస్తోంది. పోలీసులకు సైతం ఆమెను ఆపడం సవాలుగా మారింది. ముట్టుకుంటే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరింపులకు పాల్పడంతో ఏమీ చేయలేకపోతున్నారు. మరోవైపు అఘోరీ మాత శివాలెత్తింది. ఏకంగా కర్ర తీసుకొని చితకబాదింది. ఆ వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా, పోలీసులు రంగప్రవేశం చేశారు. అయితే అఘోరీ మాతపై పోలీసులు కేసు నమోదు చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం.తెలుగు రాష్ట్రాలలో పెను సంచలనం గా మారిన అఘోరీ మాత తెలియని వారుండరు. ఈమె ఇటీవల పలుమార్లు వివాదాస్పద వ్యాఖ్యలు కూడా చేసి వార్తల్లో నిలిచారు. నిన్న అఘోరా గురువును కలిసిన, అఘోరీ మాత వేములవాడ ఆలయంలో గల దర్గాను తొలగించేంత వరకు తన పోరాటం సాగుతుందని, అప్పటికీ స్పందన లేకుంటే తాను ఏంటో, తన శక్తి ఏంటో చూపుతానని అఘోరీ మాత అన్నారు. అయితే తాజాగా మరో వివాదంలో ఇరుక్కున్నారు అఘోరీ మాత. అఘోరీ మాత కంటే ఆమె కారుకు యూత్ లో క్రేజ్ ఎక్కువ. కారు పైన స్టిక్కర్లు, కారు లోపల పుర్రెలు, ఇలా ఒకటి కాదు కారు మొత్తం కొత్త తరహాలోనే అలంకరించబడి ఉంటుంది. అందుకే కాబోలు అఘోరీ మాత ఎక్కడికి వెళ్లినా, ఆమె కారుకు సైతం క్రేజ్ ఉంటుందని చెప్పవచ్చు. ఈ దశలో మంగళవారం తన కారును శుభ్రపరిచేందుకు సర్వీస్ సెంటర్ కు తీసుకువెళ్లారు అఘోరి మాత. మంగళగిరిలోని ఓ కారు వాష్ సెంటర్ వద్దకు కారును తీసుకువెళ్లిన అఘోరీ మాత వెంటనే సర్వీస్ చేసి ఇవ్వాలని కోరారు. ఇలా వాటర్ సర్వీస్ సిబ్బంది, ఆమె కారును శుభ్రం చేస్తున్న క్రమంలో ఈ విషయం తెలుసుకున్న పలువురు యువకులు, మీడియా ప్రతినిధులు అక్కడికి చేరుకున్నారు. కారును వాష్ చేస్తుండగా, యువకులు సెల్ ఫోన్ లో వీడియోలు తీయడం ప్రారంభించారు. అదే క్రమంలో పలువురు మీడియా మిత్రులు కూడా కారును వీడియో తీస్తుండగా, అప్పుడే తీవ్ర ఆగ్రహంతో కర్ర తీసుకొని అఘోరీ మాత మంగళగిరిలో హల్చల్ చేశారు. ఇష్టారీతిన అక్కడ యువకులను, ఓ మీడియా ప్రతినిధిని సైతం కర్రతో బాదగా, ఒకరికి తీవ్ర గాయాలైనట్లు సమాచారం. ఈ దాడి పై సమాచారం అందుకున్న పోలీసులు, అక్కడికి చేరుకొని అసలేం జరిగిందో తెలుసుకునే ప్రయత్నం చేశారు. తమపై కర్రలతో దాడి చేసినట్లు యువకులు తెలుపుతుండగా, అసలు ఇందులో ఏ మేరకు వాస్తవం ఉందో తెలియాలంటే అఘోరీ మాత స్పందించాల్సిన అవసరం ఉంది. కానీ ఏకంగా అఘోరీ మాత కర్రతో దాడి చేసిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి.

# పాకిస్తాన్‌లో తీవ్ర గాలి కాలుష్యం..

**పలు నగరాల్లో లాక్‌డౌన్ విధింపు**

పంజాబ్ ప్రావిన్స్,నవంబర్18(ఆర్ఎన్ఎ): గాలి కాలుష్యం ఢిల్లీ–ఎన్‌సిఆర్, ఉత్తర భారతదేశంలోనే కాకుండా.. పాకిస్తాన్‌లో కూడా బీభత్సం సృష్టిస్తోంది. ఈ క్రమంలో పంజాబ్ ప్రావిన్స్‌లోని రెండు నగరాలు లాహోర్, ముల్తాన్‌లలో పూర్తి లాక్‌డౌన్ విధించారు. తీవ్ర గాలి కాలుష్యం కారణంగా దారుణమైన పరిస్థితులు ఏర్పడ్డాయి. ముల్తాన్ నగరంలో AQI 2000 దాటింది. లాహోర్‌లో AQI 1100 కంటే ఎక్కువగానే కొనసాగుతోంది. ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (AQI) ప్రమాదకర స్థాయికి చేరుకోవడంతో పంజాబ్ ప్రభుత్వం లాహోర్, ముల్తాన్‌లలో పూర్తి లాక్‌డౌన్ విధించిందని పాక్ మీడియా నివేదికలు చెబుతున్నాయి. ARY న్యూస్ రిపోర్టు ప్రకారం.. లాహోర్ ప్రపంచంలోని రెండవ అత్యంత కాలుష్య నగరంగా ప్రకటించారు. పంజాబ్ సీనియర్ ప్రావిన్షియల్ మంత్రి మరియం ఔరంగజేబ్ మాట్లాడుతూ.. పొగమంచు, కాలుష్యం వల్ల కలిగే తీవ్రమైన ఆరోగ్య ప్రమాదాల గురించి వివరించారు. దీనివల్ల ప్రజారోగ్య సంక్షోభం ఏర్పడిందని.. ప్రజలు శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్నారని అన్నారు. ఇప్పటి పరిస్థితులను కోవిడ్ సమయంలో అనుభవించిన ప్రమాదాలతో పోల్చాడు. మరోవైపు.. పెరుగుతున్న కాలుష్యం దృష్ట్యా.. పంజాబ్ ప్రభుత్వం నవంబర్ 24 వరకు హయ్యర్ సెకండరీ స్థాయి వరకు పాఠశాలలను మూసివేస్తున్నట్లు ప్రకటించింది.ఇదిలా ఉంటే.. పంజాబ్ ప్రావిన్స్‌లో కేవలం ఒక వారంలోనే 600,000 మందికి పైగా ప్రజలు కాలుష్య సంబంధిత వ్యాధుల బారిన పడ్డారు. గత వారంలో 65,000 మందికి పైగా ప్రజలు ఆసుపత్రి పాలయ్యారు. ఈ దృష్ట్యా, ప్రాంతీయ ప్రభుత్వం పారామెడికల్ సిబ్బంది సెలవులను రద్దు చేసింది. %ప్రాణ% సమయాన్ని రాత్రి 8 గంటల వరకు పొడిగించింది.

# గల్ఫ్ దేశాల్లో కఠినంగా చట్టాలు

**100 మంది విదేశీయులకు మరణ శిక్ష విధింపు**

ఖతర్,నవంబర్18 : గల్ఫ్ దేశాల్లో చట్టాలు చాలా కఠినంగా ఉంటాయి. ముఖ్యంగా హత్య, డ్రగ్స్ సరఫరా, అత్యాచారం లాంటి నేరాలకు మరణ శిక్ష విధించబడుతుంది. దొంగతనం చేస్తే.. చేతి వేళ్లు, చేతులు, నరికివేయబడతాయి. ఈ శిక్షలు ముఖ్యంగా సౌదీ అరేబియా, ఖతర్ లాంటి దేశాల్లో తీవ్రంగా అమలు పరుస్తున్నారు. అక్కడి ప్రభుత్వాలు తమ దేశంలో నేరం జరగడాన్ని సహించవు. అయితే కొన్ని నేరాలకు మరణ శిక్ష విధించడంపై మానవ హక్కుల సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి. ముఖ్యంగా సౌదీ అరేబియాలో ఈ సంవత్సరం మరణ శిక్ష ద్వారా వధించబడిన విదేశీయుల సంఖ్య 100 దాటేసింది. ఈ గణాంకాలు చాలా భయంకరగా ఉన్నాయని బెర్లిన్ లోని యూరోపియన్ %–% సౌదీ ఆర్గనైజేషన్ ఫర్ హ్యూమన్ రైట్స్ సంస్థ ఆవేదన వ్యక్తం చేసింది. శనివారం నవంబర్ 16 2024న సౌదీ అరేబియా దేశంలోని దక్షిణ నజ్రాన్ ప్రాంతంలో ఒక యెమెన్ దేశస్తుడిని శిరచ్ఛేదన ద్వారా మరణ శిక్ష అమలు పరిచారు. ఆ వ్యక్తి తమ దేశంలో అక్రమంగా డ్రగ్స్ సరఫరా చేస్తూ పట్టుబడ్డాడని.. అతడు దోషిగా తేలినందుకు మరణ శిక్ష విధించామని సౌదీ ప్రభుత్వం ప్రకటించింది. నజ్రాన్ మరణించిన యెమెనీ వ్యక్తితో కలిపి 2024లో మరణ శిక్ష ద్వారా చనిపోయిన విదేశియుల సంఖ్య 101 కి చేరిందని స్థానిక మీడియా రిపోర్ట్. 2023, 2022 సంవత్సరాలలో మరణ శిక్ష ద్వారా వధింపబడిన నేరస్తుల కంటే 2024 లో వధింపబడిన విదేశీ నేరస్తుల సంఖ్య మూడింతలకు చేరింది. గత రెండు సంవత్సరాలలో 34 మంది విదేశీ నేరస్తులు వధించబడ్డారు అని ఫ్రెంచ్ మీడియా ఎఎఫ్‌పి తెలిపింది. విదేశీ నేరస్తులను ఇంత పెద్ద సంఖ్యలో శిరచ్ఛేదన లాంటి క్రూర శిక్షలు వేయడం చాలా సీరియస్ అంశం అని ESOHR మానవ హక్కుల డైరెక్టర్ తాహా అల్ హజ్జీ అభిప్రాయపడ్డారు.అమ్నెస్టి ఇంటర్నేషనల్ రిపోర్ట్ ప్రకారం.. 2023లో విదేశీయులకు మరణ శిక్ష విధించిన దేశాల జాబితాలో చైనా, ఇరాన్ తరువాత మూడో స్థానంలో సౌదీ అరేబియా ఉండగా.. ఈ సంవత్సరం ఈ జాబితా సౌదీ అరేబియా ప్రథమ స్థానానికి చేరింది. ఇప్పటివరకు ఈ సంవత్సరంలో వధింపబడిన స్థానికులు, విదేశి నేరస్తుల సంఖ్య 274కు చేరింది. 2024 సంవత్సరం ముగిసేలోగా ఈ సంఖ్య 300 దాటుతుందని మిడిల్ ఈస్ట్ దేశాల్లో మరణ శిక్షలకు వ్యతరేకంగా పోరాడుతున్న జీద్ బస్‌యూనీ అనే మహిళా లాయర్ అభిప్రాయపడ్డారు. మరణ శిక్ష విధించబడిన విదేశీయుల కుటుంబ సభ్యులు అనుక్షణం భయం గుప్పిట్లో బతుకుతున్నారని ఆమె అన్నారు. అంతర్జాతీయ చట్టాల ప్రకారం.. మానవ హక్కులు పాటించడం లేదని సౌదీ అరేబియా ప్రభుత్వం చాలా కాలంగా విమర్శలు ఎదుర్కొంటూనే ఉంది. దీనివల్ల సౌదీలో విదేశీ పర్యాటకులు, పెట్టుబడిదారులుఅయితే ఈ సంవత్సరం మరణ శిక్ష ద్వారా చనిపోయిన విదేశీయుల జాబితాలో ఎక్కువ శాతం పాకిస్తానీలున్నారు. ఈ జాబితాలో అత్యధికంగా 21 మంది పాకిస్తానీలు, 20 మంది యెమెనీలు, 14 మంది సిరియా పౌరులు, 9 మంది ఈజిప్ట్ దేశస్తులు, 8 మంది జోర్డాన్, 7 మంది ఇథియోపియా దేశానికి చెందినవారున్నారు. ఆ తరువాత సుడాన్, ఇండియా, ఆఫ్ఘనిస్తాన్, శ్రీలంక, ఎరిత్రియా, ఫిలిప్పీన్స్ పౌరుల సంఖ్య చూస్తే.. ప్రతి దేశం నుంచి ముగ్గురు చనిపోయారు.

# శాంతిభద్రతలపై ఏపీ శాసన మండలిలో చర్చ

**ఇరుపక్షాల మధ్య మాటల యుద్ధం**

**శాంతి భద్రతలు ఇష్యూ, సభ్యులు వాకౌట్..**

అమరావతి, నవంబర్ 18 : రాష్ట్రంలో శాంతిభద్రతలపై శాసన మండలిలో చర్చ జరిగింది. ఒకానొక దశలో ఇరుపక్షాల మధ్య మాటల యుద్ధం తీవ్రమైంది. ఈలోగా హోంమంత్రి అనిత ఇచ్చిన సమాధానం తో సంతృప్తి చెందిమండలి సమావేశాలు సోమవారం ఉదయం ప్రారంభమయ్యాయి. ప్రశ్నోత్తరాల సమయంలో శాంతి భద్రతలపై చిన్నపాటి చర్చ జరిగింది. ఈ సందర్భంగా హోంమంత్రి అనిత వివరాలను సభ ముందు ఉంచారు. దీనిపై వైసీపీ సభ్యులు పలు ప్రశ్నలు లేవనెత్తారు. ముచ్చుమర్రి కేసు, అత్తా కోడలు రేప్ కేసు వంటి అంశాలు మండలిని కుదిపేశాయి. దిశ యాప్, చట్టం గురించి వైసీపీ సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలపై హోంమంత్రి అనిత తనదైన శైలిలో రిప్లై ఇచ్చారు. 2014-19 మధ్యకాలంలో 83 వేల కేసులు నమోదు కాగా, 2019-24 మధ్య కాలంలో లక్షా 508 కేసులు నమోదు అయినట్టు హోంమంత్రి అనిత తెలిపారు. దాదాపు 20.8 శాతం కేసులు వైసీపీ హయాంలో పెరిగాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత క్రైమ్ రేటు క్రమంగా తగ్గుతోందన్నారు. మహిళ భద్రత కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. గతంలో సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్లు మూడు మాత్రమే ఉండేవని, ఇప్పుడు జిల్లాకు ఒకటి చొప్పున ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.ప్రతీది రాజకీయ విమర్శలు చేయడం తగదని వైసీపీ సభ్యులకు హితవు పలికారు హోంమంత్రి అనిత. కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చిన నుంచి ఇప్పటివరకు జరిగిన ఘటనలకు సంబంధించి 24 గంటల నుంచి 48 గంటల లోపు దాదాపుగా నిందితులను అరెస్ట్ చేశామన్నారు. వారందర్నీ రిమాండ్‌కు తరలించామన్నారు. ముచ్చుమర్రి విషయంలో ఆమె ఐడెంటిఫికేషన్ కాలేదన్నారు. ఐదునెలల్లో పోలీసుల వద్ద సదుపాయాలు లేకపోయినా, నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. గడిచిన ఐదేళ్లు పోలీసులు ఎక్కడున్నారని ప్రశ్నించారు హోంమంత్రి.

దిశ చట్టం, యాప్ గురించి మాట్లాడుతున్నారని, అసలు దిశ చట్టం ఉందా? చట్టబద్దత ఉందా? అంటూ ప్రశ్నల మీద ప్రశ్నలు వేశారు మంత్రి. వైసీపీ హయాంలో పోలీసులకు ఓ రేపిస్టు ఛాలెంజ్ విసిరిన విషయం గుర్తు లేదా అంటూ ప్రశ్నించారు. వైసీపీ హయాంలో అప్పటి సీఎం ఇంటి సమీపంలో జరిగిన గ్యాంగ్ రేసు ఘటన గురించి ప్రస్తావించారు. దిశ యాప్ అనేది గత టీడీపీ ప్రభుత్వం ఫోర్త్ లైన్ పేరిట యాప్ తీసుకొచ్చిందని, దాన్ని కన్వెర్ట్ చేసి దిశ యాప్‌గా మార్చారన్నారు మంత్రి. దిశ చట్టం వచ్చిన తర్వాత చాలా మందిని పట్టుకున్నామని గత ప్రభుత్వం చెబుతోందని, అలాంటప్పుడు నేరాలు ఎందుకు పెరిగాయని సూటిగా ప్రశ్నించారు మంత్రి. లేని దిశ చట్టం గురించి మాట్లాడుతున్నారని, నిర్భయం చట్టం కింద కేసులు పెట్టడానికి ఎందుకు ముందుకు రాలేదన్నారు. కనీసం అమరావతిలో ల్యాబ్ లేకుండా చేశారన్నారు. ల్యాబ్ పూర్తయితే వుంటే నిందితులకు నాలుగైదు నెలల్లో శిక్షలు పడేవన్నారు. ఈ క్రమంలో మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ జోక్యం చేసుకున్నారు. సభ్యులు అడిగిన ప్రశ్నలకు హోం మంత్రి అనిత సరిగా సమాధానం చెప్పలేదని, రాజకీయ ఉపన్యాసం చేశారని అన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు సరిగా లేవని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. మంత్రి సమాధానంతో సంతృప్తి చెందని విపక్ష సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. వెంటనే జోక్యం చేసుకున్న హోంమంత్రి అనిత.. దమ్మంటే నిలబడాలంటూ వ్యాఖ్యానించారు. వినే ఓపిక లేక సభ నుంచి వాకౌట్ చేస్తున్నారని అన్నారు. మంత్రి వ్యాఖ్యలపై ఛైర్మన్ జోక్యం చేసుకున్నారు. మంత్రిగా ఉన్న మీరు దమ్ము, ధైర్యం అనే పదాలు వాడడం కరెక్ట్ కాదన్నారు. తప్పు తెలుసుకున్న హోంమంత్రి అనిత, క్షమాపణలు చెప్పారు.



# తొలి టెస్టే కీలకం

## మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్




ప్రతిష్ఠాత్మక బోర్డర్-గావస్కర్ ట్రోఫీ ఆడేందుకు భారత్ సిద్ధమవుతోంది. సొంత గడ్డపై న్యూజిలాండ్ చేతిలో వైట్‌వాష్‌కు గురైన అనంతరం టీమ్‌ఇండియా ఆడుతున్న సిరీస్ కావడం.. డబ్ల్యూటీసీ ఫైనల్ కు చేరాలంటే ఈ సిరీస్‌లో విజయాలు కీలకమవడంతో.. అందరి దృష్టి దీనిపైనే ఉంది. మరోవైపు జట్టును గాయాల బెడద వెంటాడుతుండగా.. తొలి టెస్టుకు దాదాపు రోహిత్ శర్మ అందుబాటులో ఉండటం లేదు. ఈనేపథ్యంలో మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్ జట్టుపై కీలక వ్యాఖ్యలు చేశాడు. సిరీస్ విజయవకాశాల పైనా స్పందించాడు. టీమ్‌ఇండియా ఇటీవల ప్రదర్శనను పట్టించుకోనని.. ఆస్ట్రేలియాలో పిచ్‌లు బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉంటాయని హర్భజన్ పేర్కొన్నాడు. "విజయావకాశాలు ఇద్దరికీ 50-50గా ఉన్నాయి. ఇటీవల భారత్ ఆడిన ఆటను నేను పరిగణనలోకి తీసుకోవడం లేదు. ఎందుకంటే ఆ పరిస్థితులు భిన్నం. గొప్ప బ్యాటర్లు కూడా బ్యాటింగ్ ఎలా చేయాలో తెలియదన్నట్లు న్యూజిలాండ్‌పై ఆడారు. సీనియర్లు వెళ్లి రంజీల్లో ఆడాలని సూచనలు వచ్చాయి. అయితే.. అది సమస్యను పరిష్కరించదు. ఆస్ట్రేలియాలో మంచి పరిస్థితులు ఉంటాయి. పిచ్‌లు బాగుంటాయి' అని భజ్జీ ఓ యూట్యూబ్ ఛానల్‌లో విశ్లేషించాడు. టీమ్‌ఇండియాకు తొలి టెస్టు ఎంతో కీలకమని హర్భజన్ పేర్కొన్నాడు. "భారత బ్యాటర్లు బాగా ఆడతారని భావిస్తున్నాను. మనకు పుజారా లాంటి ప్లేయర్ కావాలి. కేఎల్ రాహుల్‌పై చాలా విమర్శలు వస్తున్నాయి. అయితే.. అతడు క్లాస్ ప్లేయర్. విజయావకాశాలు ఇరు జట్లకు సమానంగానే ఉన్నప్పటికీ.. ఆసీస్ వైపే మొగ్గు ఉంటుందని నేను భావిస్తున్నాను. ఎందుకంటే వారు సొంత గడ్డపై ఆడుతున్నారు. మరోవైపు న్యూజిలాండ్‌తో సిరీస్‌లో వైట్‌వాష్ అయిన భారత్ ఆత్మవిశ్వాసం కొద్దిగా దెబ్బతింది. ఇక ఈ సిరీస్‌లో తొలి టెస్టు చాలా కీలకం. పెర్త్‌లో భారత్ శుభారంభం చేస్తే.. ఆ తర్వాత సిరీస్‌లో గట్టి పోటీనివ్వొచ్చు. ఒకవేళ తొలి మ్యాచ్‌లోనే ఓడితే మాత్రం.. టీమ్‌ఇండియాకు కష్టాలు మరింత ఎక్కువవుతాయి" అని హర్భజన్ స్పష్టంచేశాడు. పెర్త్ వేదికగా నవంబర్ 22 నుంచి ప్రారంభం కానున్న తొలి టెస్టుతో బోర్డర్-గావస్కర్ ట్రోఫీ ప్రారంభం కానుంది. ఫైనల్‌కు చేరాలంటే ఇరు జట్లకు ఇందులో విజయం సాధించడం ఎంతో కీలకం.



## విరాట్ కోహ్లీకి ఆఖరి సిరీస్

### బీసీసీఐ మాజీ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ

పేలవ ఫామ్‌తో బాధపడుతున్న టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీకి దిగ్గజ కెప్టెన్, బీసీసీఐ మాజీ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ అండగా నిలిచాడు. తనకు అచ్చొచ్చిన ఆసీస్ గడ్డపై విరాట్ కోహ్లీ చెలరేగుతాడని ఆశాభావం వ్యక్తం చేశాడు. న్యూజిలాండ్‌తో టెస్ట్ సిరీస్‌లో విరాట్ కోహ్లీ విఫలమవ్వడంపై ఆందోళన వ్యక్తం చేయాల్సిన పనిలేదన్నాడు. బ్యాటింగ్‌కు పిచ్‌లు అనుకూలంగా లేకపోవడంతోనే కోహ్లీ రాణించలేక పోయాడని చెప్పాడు. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీనే ఆసీస్ గడ్డపై విరాట్ కోహ్లీకి చివరి సిరీస్ అయ్యే అవకాశం ఉందని అభిప్రాయపడ్డాడు. ఈ ఏడాది కోహ్లీ 12 టెస్ట్ ఇన్నింగ్స్‌ల్లో 250 పరుగులు మాత్రమే చేశాడు. అతని పేలవ ఫామ్ టీమిండియా పరాజయాలకు కారణమవుతోంది. దాంతో అతనిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఆసీస్ గడ్డపై విరాట్ కోహ్లీకి మెరుగైన రికార్డ్ ఉండటం కలిసొచ్చే అంశం. ఆసీస్ గడ్డపై 13 టెస్ట్‌లు ఆడిన కోహ్లీ 54.08 సగటుతో 1352 పరుగులు చేశాడు. ఇందులో 6 సెంచరీలు ఉన్నాయి. ఈ క్రమంలోనే గంగూలీ.. ఓ ఛానల్‌తో మాట్లాడుతూ కోహ్లీ బ్యాటింగ్‌పై ధీమా వ్యక్తం చేశాడు. 'విరాట్ కోహ్లీ ఓ ఛాంపియన్ బ్యాటర్. ఈ విషయంలో ఎలాంటి సందేహం అక్కర్లేదు. గతంలో ఆసీస్ గడ్డపై కోహ్లీ దుమ్మురే పాడు. 2014 పర్యటనలో నాలుగు శతకాలు.. 2018లో ఒక శతకం బాదాడు. తాజా సిరీస్‌లోనూ సత్తా చాటుతాడు. ఆస్ట్రేలియా గడ్డపై కోహ్లీ కి ఇదే చివరి టెస్ట్ సిరీస్ కానుంది. కాబట్టి అతనికి ఈ సిరీస్ చాలా కీలకమైనది. న్యూజిలాండ్‌తో సిరీస్‌లో కోహ్లీ వైఫల్యంపై ఆందోళన పడాల్సిన అవసరం లేదు. బ్యాటింగ్‌కు ఆ పిచ్‌లు ప్రతికూలంగా ఉన్నా యి. బ్యాటింగ్‌కు సహకరించలేదు. కానీ ఆస్ట్రేలియాలో పిచ్‌లు అలా ఉండవు. అక్కడి పరిస్థితులను కోహ్లీ బాగా ఆస్వాదిస్తాడు. అతను మెరుగైన ప్రదర్శన చేస్తాడనుకుంటున్నా.'అని గంగూలీ చెప్పుకొచ్చాడు. యువ బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్‌కు కూడా తుది జట్టులో చోటివ్వాలని సూచించాడు.



## వెల్లింగ్టన్ మ్యాచ్‌లో బ్రేస్‌వెల్ కొకైన్ మత్తులో ఉన్నాడు

### వెల్లడించిన స్పోర్ట్స్ ఇంటెగ్రిటీ కమిషన్

ఒలింపిక్స్ వంటి పెద్ద ఈవెంట్లలో తమ ప్రదర్శనను మెరుగుపరుచుకోవడానికి అథ్లెట్లు డ్రగ్స్ వాడటం గురించిన అప్పుడప్పుడు మన వింటూనే ఉంటాం. అయితే ఇప్పుడు క్రికెట్‌లో ఇలాంటి షాకింగ్ సంఘటన ఒకటి వెలుగులోకి వచ్చింది. ఒక న్యూజిలాండ్ క్రికెటర్ మ్యాచ్‌కు ముందు కొకైన్ ప్రభావంతో మైదానంలోకి వచ్చి, అద్భుతంగా బౌలింగ్ చేశాడు. అలాగే, ఆ తర్వాత తన తుఫాన్ బ్యాటింగ్‌తో జట్టును గెలిపించాడు. అయితే, మ్యాచ్ తర్వాత అతన్ని పరీక్షించినప్పుడు, అతను పాజిటివ్ అని తేలాడు. దీంతో అతనిపై ఒక నెల నిషేధం కూడా విధించారు. వాస్తవానికి, న్యూజిలాండ్ ఫాస్ట్ బౌలింగ్ ఆల్ రౌండర్ డగ్ బ్రేస్‌వెల్ ఈ ఏడాది జనవరిలో దేశవాళీ టీ20 మ్యాచ్ ఆడాడు. సెంట్రల్ డిస్ట్రిక్ట్స్ తరపున ఆడిన 34 ఏళ్ల బ్రేస్‌వెల్ వెల్లింగ్టన్‌తో జరిగిన మ్యాచ్‌లో కొకైన్ మత్తులో ఉన్నాడని స్పోర్ట్స్ ఇంటెగ్రిటీ కమిషన్ వెల్లడించింది. మద్యం మత్తులో ఆ మ్యాచ్‌లో అద్భుత ప్రదర్శన చేశాడు. టాస్ గెలిచిన వెల్లింగ్టన్ జట్టు ముందుగా బ్యాటింగ్ ఎంచుకుంది. అతనికి వ్యతిరేకంగా బౌలింగ్ చేస్తున్నప్పుడు, బ్రేస్‌వెల్ 4 ఓవర్లలో కేవలం 21 పరుగులిచ్చి 2 వికెట్లు పడగొట్టాడు. మొదట బ్యాటింగ్ చేసిన వెల్లింగ్టన్ 148 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించగా, దానిని ఛేదించే సమయంలో బ్రేస్‌వెల్ 11 బంతుల్లో అజేయంగా 30 పరుగులు చేశాడు. ఈ చిన్న ఇన్నింగ్స్‌లో అతను 4 సిక్సర్లు బాదాడు. దీంతో పాటు మ్యాచ్‌లో రెండు క్యాచ్‌లు కూడా అందుకున్నాడు. ఈ తుఫాన్ ప్రదర్శన కారణంగా సెంట్రల్ డిస్ట్రిక్ట్స్ జట్టు 19 బంతులు మిగిలి ఉండగానే 6 వికెట్ల తేడాతో సులువుగా విజయం సాధించింది. ఆ తర్వాత బ్రేస్‌వెల్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యాడు. మ్యాచ్ ముగిసిన తర్వాత అతడిని పరీక్షించగా పాజిటివ్‌గా తేలాడు. దీంతో నిబంధనల ప్రకారం ఈ ఆల్ రౌండర్‌పై నిషేధం విధించారు. బ్రేస్‌వెల్ కొకైన్ సేవించినట్లు అతని బృందం కూడా అంగీకరించింది. అయితే జట్టుకు, మ్యాచ్‌కు ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. ఫుల్‌గా మద్యం మత్తులో ఉన్నాడంట.. అయినప్పటికీ, బ్రేస్‌వెల్ చికిత్సలో పాల్గొన్నాడు. ఆ తర్వాత అతని శిక్ష ఒక నెలకు తగ్గించారంట. ఏప్రిల్ 2024 నాటి మాదకద్రవ్యాల దుర్వినియోగానికి బ్రేస్‌వెల్‌కు ఒక నెల శిక్ష విధించారు. అతను మార్చి 2024లో తన చివరి హోమ్ మ్యాచ్ ఆడాడు. రెట్రోస్పెక్టివ్ ఎఫెక్ట్‌తో శిక్ష విధించడంతో, అతని సస్పెన్షన్ పూర్తయింది. అతను మరోసారి క్రికెట్‌లో పాల్గొనవచ్చని తీర్పు ఇచ్చింది.

## అశ్విన్ నాకు ఎన్నో విషయాలు నేర్పాడు

### ఆస్ట్రేలియా స్టార్ స్పిన్నర్ నాథన్ లైయన్



బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ 2024-25లో భాగంగా ఆస్ట్రేలియా, భారత్ జట్ల మధ్య నవంబర్ 22న పెర్త్ వేదికగా తొలి టెస్టు ఆరంభం కానుంది. ఈ టెస్ట్ కోసం ఇరు జట్ల సన్నద్ధమవుతున్నాయి. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు వెళ్లాలంటే.. ఈ సిరీస్ ఆస్ట్రేలియా, భారత్‌లకు అత్యంత కీలకం. కాబట్టి విజయం కోసమే ప్లేయర్స్ బరిలోకి దిగుతున్నారు. పేస్ పిచ్‌లపై స్పిన్నర్లు కూడా రాణించే అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో భారత సీనియర్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్, ఆస్ట్రేలియా స్టార్ స్పిన్నర్ నాథన్ లైయన్ వికెట్ల వేట కోసం సిద్ధంగా ఉన్నారు. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ సందర్భంగా నాథన్ లైయన్ స్పందించాడు. ఆర్ అశ్విన్ తనకు గురువు అని, యాష్ స్పిన్ టెక్నిక్స్‌ను చూసి చాలా విషయాలు నేర్చుకున్నానని చెప్పాడు. ఫాక్స్ క్రికెట్‌తో లైయన్ మాట్లాడుతూ%ె% 'ఆర్ అశ్విన్ అద్భుతమైన బౌలర్. ఈ విషయం ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. గణాంకాలే చెబుతాయి యాష్ బౌలింగ్ గురించి. నా కెరీర్ మొత్తంలో ఎక్కువగా అశ్విన్‌తోనే తలపడ్డా. ఇంకా తలపడుతూనే ఉన్నా. యాష్ నుంచి చాలా విషయాలను నేర్చుకున్నా. పరిస్థితులకు త్వరగా ఎలా అలవాటుపడాలనేది అతడిని చూసే తెలుసుకున్నా' అని చెప్పాడు. 'ప్రపంచంలోనే అత్యుత్తమ బౌలర్లలో అశ్విన్ ఒకడు. తెలివైన బౌలర్ మాత్రమే కాదు.. ఏ విషయాన్ని అయినా చాలా త్వరగా నేర్చుకోగలడు. ఓ గురువుగా నాకు చాలా విషయాలు చెప్పాడు. అతడి బౌలింగ్ ఫుటేజీలను ఎప్పుడూ చూస్తూ ఉండేవాడిని. భారత్‌లో ఎలా బౌలింగ్ చేస్తాడు, ఆస్ట్రేలియాలో ఎలా బంతులు విసురుతాడు అని గమనిస్తా. మరోసారి ఆస్ట్రేలియా, భారత్ మధ్య సిరీస్ రసవత్తరంగా ఉంటుంది. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు వెళ్లాలంటే ఈ సిరీస్ కీలకం. బాగా రాణించేందుకు ప్రయత్నిస్తా' అని నాథన్ లైయన్ చెప్పుకొచ్చాడు. 2011/12 సిరీస్‌లో యాష్, లైయన్ పోటీ ఆరంభమైంది. ఇద్దరు స్పిన్నర్లు వారి కెరీర్‌లో ముఖ్యమైన మైలురాళ్లను సాధించారు. ఇద్దరు 500 టెస్ట్ వికెట్ల మైలురాయిని అందుకున్నారు.




## పాకిస్థాన్ ఘోర పరాజయం

### 3-0తో మూడు టీ20ల సిరీస్ క్లీన్ స్వీప్
### మార్కస్ స్టోయినీస్ ఊచకోత..

ఆస్ట్రేలియా పర్యటనను పాకిస్థాన్ ఘోర పరాజయంతో ముగించింది. మూడు వన్డేల సిరీస్‌ను 2-1తో గెలుచుకున్న పాకిస్థాన్.. మూడు టీ20ల సిరీస్‌లో మాత్రం 3-0తో క్లీన్ స్వీప్ అయ్యింది. సోమవారం ముగిసిన మూడో టీ20లో ఆస్ట్రేలియా 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. బౌలర్ల అసాధారణ ప్రదర్శనతో పాటు మార్కస్ స్టోయినీస్ (27 బంతుల్లో 5 ఫోర్లు, 5 సిక్స్‌లతో 61 నాటౌట్) విధ్వంసకర బ్యాటింగ్‌తో ఆసీస్ గెలుపొందింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ 18.1 ఓవర్లలో 117 పరుగులకు కుప్పకూలింది. బాబర్ ఆజామ్(28 బంతుల్లో 4 ఫోర్లతో 41) ఒక్కడే రాణించగా.. మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. ఆసీస్ బౌలర్లలో ఆరోన్ హార్డీ(3/21) మూడు వికెట్లు తీయగా.. ఆడమ్ జంపా(2/11), స్పెన్సర్ జాన్సన్ (2/24) రెండేసి వికెట్లు తీసారు. గ్జేవియర్ బార్ట్‌లెట్, నాథన్ ఎల్లిస్ తలో వికెట్ తీసారు. అనంతరం ఆస్ట్రేలియా 11.2 ఓవర్లలో 3 వికెట్లకు 118 పరుగులు చేసి 52 బంతులు మిగిలి ఉండగానే సునా యస విజయాన్నందుకుంది. మార్కస్ స్టోయినీస్‌తో పాటు జోష్ ఇంగ్లిస్(24 బంతుల్లో 4 ఫోర్లతో 27) రాణించారు. పాకిస్థాన్ బౌలర్ల లో షాహీన్ షా అఫ్రిది, జహందాద్ ఖాన్, అబ్బాస్ అఫ్రిది తలో వికెట్ తీసారు.

### కోల్‌కతా, ఢిల్లీ క్యాపిటల్స్ ఫ్రాంచైజీలు

## శ్రేయస్ కోసం పోటీ పడతాయి




ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2025 మెగా వేలానికి సమయం ఆసన్నమైంది. నవంబర్ 24, 25 తేదీలలో సౌదీ అరేబియాలోని జెడ్డా వేదికగా మెగా ఆక్షన్ జరగనుంది. వేలానికి మొత్తంగా 1,574 మంది ఆటగాళ్లు పేర్లను నమోదు చేసుకోగా.. అందులో 574 మందిని బీసీసీఐ షార్ట్ లిస్ట్ చేసింది. ఇందులో 366 మంది భారత ఆటగాళ్లు, 208 మంది విదేశీ ప్లేయర్లు ఉన్నారు. ఇక 204 ఆటగాళ్లను కొనుగోలు చేయడానికి 10 ఫ్రాంచైజీలు సిద్ధమయ్యాయి. ఐపీఎల్ 2025 మెగా వేలంలో టీమిండియా స్టార్ ప్లేయర్స్ రిషబ్ పంత్, శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్‌లు ఉన్నారు. కెప్టెన్సీ అనుభవం ఉన్న ఈ ముగ్గురిపై కాసుల వర్షం కురవనుంది. మెగా వేలం నేపథ్యంలో శ్రేయస్ గురించి భారత దిగ్గజ క్రికెటర్, వ్యాఖ్యాత సునీల్ గవాస్కర్ తన అభిప్రాయాన్ని వెల్లడించారు. కోల్‌కతా నైట్ రైడర్స్, ఢిల్లీ క్యాపిటల్స్ ఫ్రాంఛైజీలు శ్రేయస్ కోసం పోటీ పడతాయని తెలిపారు. వేలంలో శ్రేయస్ వచ్చినప్పుడు కేకేఆర్ బిడ్ (రైట్ టు మ్యాచ్) వేస్తుందని, ఢిల్లీ కూడా అతని కోసం ప్రయత్నించవచ్చని బోల్డ్ ప్రిడిక్షన్ చెప్పారు. స్టార్ స్పోర్ట్స్ షో 'గేమ్ ప్లాన్'లో సునీల్ గవాస్కర్ మాట్లాడుతూ%ె% 'గత సంవత్సరం కేకేఆర్ టైటిల్ గెలిచినప్పుడు శ్రేయాస్ అయ్యర్ కెప్టెన్‌గా ఉన్నాడు. నేను ఇంతకు ముందు చెప్పినట్లు రిషబ్ పంత్ ఫీజు విషయంలో భిన్నాభిప్రాయాలు రావొచ్చు. అయితే శ్రేయాస్ వేలంలోకి వచ్చిన తర్వాత కేకేఆర్ బిడ్ వేయొచ్చని నేను భావిస్తున్నాను. ఢిల్లీ కూడా ప్రయత్నించవచ్చు. పంత్ దక్కని సందర్భంలో శ్రేయస్ కోసం ఢిల్లీ తప్పక ట్రై చేస్తుంది. పంత్ కోసం ఢిల్లీ ఆర్‌టీఎమ్ కార్డ్ ఉపయోగిస్తుంది కూడా. ఎందుకంటే ఢిల్లీకి కెప్టెన్ అవసరం ఉంది' అని చెప్పుకొచ్చారు. ఐపీఎల్ 2025 కోసం సునీల్ నరైన్, ఆండ్రీ రస్సెల్, రింకూ సింగ్, రమణదీప్ సింగ్, హర్షిత్ రాణా, వరుణ్ చక్రవర్తిలను కేకేఆర్ అట్టిపెట్టుకుంది. రింకు రూ.13 కోట్లతో కేకేఆర్ టాప్ రిటెన్షన్ కాగా.. వరుణ్, సునీల్, రస్సెల్‌లను రూ.12 కోట్లతో రిటైన్ చేసుకుంది. అన్‌క్యాప్డ్ ప్లేయర్ కేటగిరీ కింద రూ.4 కోట్లతో హర్షిత్, రమణదీప్‌లతో ఒప్పందం చేసుకుంది. ఐపీఎల్ 2024లో కేకేఆర్‌ను ఛాంపియన్‌గా నిలిపిన శ్రేయస్ అయ్యర్‌ను రిటెన్షన్ చేసుకుందామనుకున్నా.. అతడు ఒప్పుకోలేదు. మరి శ్రేయాస్ ఏ జట్టుకు ఆడుతాడో చూడాలి.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
Roaming News





# జాన్వీ జివ్వుమనిపించేలా!

బాలీవుడ్ నవ నాయిక జాన్వీ కపూర్ అందాలు నెట్టింట ఏ రేంజ్ లో సంచలనమవుతాయో చెప్పాల్సిన పని లేదు. అందులోనూ మిరుమిట్లు గొలిపే చీరందంలో కి దూరిపోయిందంటే? జాన్వీ అందానికి ఎన్ని హృదయాలు గాయ పడునో! అంచనా వేయడం కష్టమే సుమీ. మరోసారి నెట్టింట అలాంటి కోతకే దిగింది జాన్వీ. ఇదిగో ఇక్కడిలో పలుచని ఉల్లి పొర చీరలో పరువాలన్నింటిని ఆవిష్కరించింది. పింక్ అండ్ వైట్ కాంబినేషన్ లో జివ్వుమనిపిస్తుంది. మ్యాచింగ్ డిజైనర్ బ్లౌజ్ లో మరింత ఆకర్షణీయంగా కని పిస్తుంది. రూప లావణ్యాన్ని హైలైట్ చేస్తూ ఎంపిక చేసుకున్న యాక్సరసీస్ ప్రతీది జాన్వీని మరింత అందంగా తీర్చి దిద్దాయి. చీరందంలో నాభి అందాల ఎలివేషన్ పైనా అంతే ఫోకస్ చేసింది. డిజైన్డ్ డ్రెస్ ల్లో అందాలు ఎలా ఆవి ష్కరించినా ..చీరలో ఆవిష్కరణ మాత్రం ఎంతో ప్రత్యేకమని మరోసారి జాన్వీ రుజువు చేస్తుంది. ప్రస్తుతం ఈ ఫోటో అంతర్జాలంలో వైరల్ గా మారింది. అంతకు మంచి కుర్రాళ్ల గుండెల్లో మంటలు పుట్టిస్తుంది. ఇలా చీరలో అందాలు దారబోయడం జాన్వీకి కొత్తేం కాదు. ఇప్పటికే చాలాసార్లు డిజైన్డ్ సారీస్ లో సెగలు రేపింది. వాటికి నెట్టింట మంచి రెస్పాన్స్ వచ్చింది. అందుకే హీరోయిన్లు అంతా చీరలో ఎలివేషన్లకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుంటారు. జాన్వీ తాజా పిక్ పై అభిమానులు తమదైన శైలి లో పోస్టు లు పెడుతున్నారు. ఇక అమ్మడి కెరీర్ సంగతి చెప్పాల్సిన పనిలేదు. బాలీవుడ్..టాలీవుడ్ ని పరుగులు పెట్టిస్తుంది. ఇటీవలే %-%దేవర%-% తో తొలి పాన్ ఇండియా సక్సెస్ అందుకుంది. ప్రస్తుతం రామ్ చరణ్ కి జోడీగా మరో సినిమాలో నటిస్తోంది. ఈ చిత్రానికి %-%ఉ ప్పెన%-% ఫేం బుచ్చిబాబు దర్శకత్వం వహిస్తోన్న సంగతి తెలిసిందే.




# టాలీవుడ్ హీరోలపై మీనాక్షి ఇంట్రెస్టింగ్ కామెంట్స్

ఇప్పుడిప్పుడే తెలుగు సినీ పరిశ్రమలో బిజీ హీరోయిన్‌గా దూసుకుపోతుం ది మీనాక్షి చౌదరి. ఇచ్చట వాహన ములు నిలుపరాదు తో తెలుగు తెరకు పరిచయమైన ఈ అమ్మడు వరుస ఆఫర్స్ అందుకుంటుంది. తాజాగా టాలీవుడ్ హీరోలపై ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేసింది. ఈ ఏడాది ప్రారంభంలోనే గుంటూరు కారం తో హిట్ అందుకుంది హీరోయిన్ మీనాక్షి చౌదరి. దీంతో టాలీవుడ్ ఇండస్ట్రీలో ఈ అమ్మడుకు వరుస ఆఫర్స్ క్యూ కట్టాయి. ఇటీవలే మట్కా తో అడియన్స్ ముందుకు వచ్చింది. వరుణ్ తేజ్ నటించిన ఈ మూవీ ప్రేక్షకులను అంతగా ఆకట్టుకోలేకపోయింది. కానీ అంతకు ముందు లక్కీ భాస్కర్ చిత్రంలో మెరిసింది. దుల్కర్ సల్మాన్ హీరోగా నటించిన ఈ మూవీ బ్లాక్ బస్టర్ హిట్ అయ్యింది. ప్రస్తుతం ఈ అమ్మడు మెకానిక్ రాకీ చిత్రంలో నటిస్తుంది. ఇందులో విశ్వక్ సేన్ హీరోగా నటిస్తున్నాడు. తాజాగా ఈ మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్లో పాల్గొన్న మీనాక్షి టాలీవుడ్ హీరోలపై ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేసింది. మహేష్ బాబు ఎంతో క్రమశిక్షణగా ఉంటారని చెప్పుకొచ్చింది. అలాగే కోలీవుడ్ హీరో విజయ్ ఎప్పుడూ ఒకేలా ఉంటారని.. దుల్కర్ సల్మాన్ వినయం తనకు చాలా ఇష్టమని తెలిపింది. అలాగే వరుణ్ తేజ్ ది పూర్తిగా జెంటిల్ మ్యాన్ నేచర్ అని.. విశ్వక్ సరదాగా ఉంటారని చెప్పుకొచ్చింది.

# స్పైసీ లుక్స్ తో లవ్లీ బ్యూటీ.. స్టన్నింగ్!

షాన్వి శ్రీవాత్సవ.. తన అందం, టాలెంట్ తో పాటు స్టైల్‌స్టేట్‌మెంట్‌తోనూ ఎప్పటికప్పుడు ప్రత్యేకంగా ఎట్రాక్ట్ చేస్తుంటుంది. ఇటీవల ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన మరికొన్ని ఫోటోలు ఆమె స్టైల్‌కు, గ్రేస్‌కు ప్రత్యక్ష ఉదాహరణ. బ్లాక్ కలర్ ట్రెండీ అవుట్‌ఫిట్‌లో షాన్వి తన గ్లామర్ అందాలను మరింతగా ఎలివేట్ చేస్తూ కనిపిస్తోంది. మొదటి ఫోటోలో షాన్వి నడుము వయ్యారాన్ని చూపుతూ కుర్రాళ్ల మనసులను దోచేస్తోంది.ఆమె చుట్టూ ఉన్న లైటింగ్ డిజైన్‌తో కలగలిపి అందంగా మెరిసిపోతుంది. ఈ ఫోటోకి “గర్ల్స్ లైక్ టు బ్లింగ్” అనే క్యాప్షన్ షాన్వి ఫ్యాషన్‌పై తన ఆసక్తిని తెలియజేస్తుంది. రెండో ఫోటోలో మిర్రర్ సెటప్‌ను ఉపయోగిస్తూ ఆమె అందాన్ని కొత్త కోణంలో హైలైట్ చేసింది. ఈ ఫోటోలో ఆమె ఎక్స్‌ప్రెషన్స్ కూడా అద్భుతంగా ఉండటంతో ఆమె మరింత హైలెట్ అయ్యింది.మూడో ఫోటోలో, మరింత హాట్ లుక్‌తో సరికొత్త డెఫినిషన్ ఇస్తోంది. ఆమె అవుట్‌ఫిట్ డిజైన్ మరియు సన్నని బంగారు గొలుసులు ఆమె లుక్‌ను మరింత ప్రత్యేకంగా మార్చాయి. షాన్వి కెరీర్ జర్నీ చూసుకుంటే 2012లో ‘లవ్లీ’ సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన షాన్వి, ఆ సినిమాతోనే మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఆ తర్వాత పలు తెలుగు చిత్రాలలో నటించినా, ఎక్కువగా అవకాశాలు రాకపోవడంతో కన్నడ ఇండస్ట్రీలోకి వెళ్లి అక్కడ స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది. కన్నడలో ఆమె చేసిన ‘మాస్టర్ పీస్’, ‘భజరంగీ 2’ వంటి సినిమాలు బాక్సాఫీస్ వద్ద ఘన విజయం సాధించాయి. తన టాలెంట్‌తో పాటు గ్లామ-ర్‌ను సరిగ్గా ఉపయోగించుకోవడంతో ఆమెకు వరుస అవకాశాలను తెచ్చిపెట్టింది. సోషల్ మీడియాలో షాన్వి యాక్టివ్‌గా ఉంటూ తరచుగా గ్లామర్ ఫోటోషూట్లను షేర్ చేస్తుంటుంది. ఆమె ఫ్యాషన్ పిక్స్, ట్రెడిషనల్ లుక్స్, వెస్ట్రన్ అవుట్‌ఫిట్స్ అన్నీ కూడా ఆమె అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. షాన్వి ఇప్పుడు తనకు వచ్చిన మంచి అవకాశాలను మరింత పదును పెడుతూ కెరీర్‌లో ఎదిగే దిశగా ప్రయాణిస్తోంది. మరి రాబోయే రోజుల్లో అమ్మడు ఇంకా ఎలాంటి అవకాశాలు అందుకుంటుందో చూడాలి.



Printed, published and owened by GOTTIPARTHI MADHURI, printed at MADHURI OFFSET PRINTERS H.NO 3-133, BC colony yadagirigutta, dist : Yadadri Buvanagiri pin : 508115, Ts Publictions at Madhuri publications. Editor : GOTTIPARTHI BHASKER. RNA TELTEL /2021/80986